



# శ్రీసాయి దర్శన్

సాయిప్రబోధ ప్రచార మాసపత్రిక

సంపుటి-7 | మార్చ్ - 2008 | సంచిక 4

## SRI SAI DARSHAN

*(SaiPrabhodha Prachar Monthly)*

Editor :
**Raojee**

Associated Editor :
**A. Lakshmi**

**Subscription Rates**

| | |
|---|---|
| Maharaja Poshakulu | Rs.1,501-00 |
| Life Membership (20 Yrs) | Rs.751-00 |
| For 3 Years | Rs.275-00 |
| For 1 Year | Rs.100-00 |

M.O's / DD's may be drawn
in favour of



**SRI SAI DARSHAN**
Dammaiguda, Nagaram Post,
Hyderabad - 500 083.
Phone : 040-65640220
Cell : 98667 48099
e-mail : srisaidarshan@rediffmail.com
Website : www.srisaidarshan.org.in


**శ్లో॥భూతేషు భూతేషు**
**విచింత్యధీరా ॥**
**ప్రేత్యా స్మాల్లోకా**
**దమృతా భవంతి ॥**

(కేనోపనిషత్తు)

**తా॥** *సర్వభూతములయందును నిండియున్న వానిని యొవ్వడు యెరుంగునో అట్టివాడే జ్ఞాని. అట్టి జ్ఞానియే భవరహితమై సాయుజ్యపదవిని గాంచగలడు.*

# విషయసూచిక


సంపాదకీయం..........3
శ్రీసాయిసద్గురు సమర్థ-సగుణోపాసన..........4
శరణాగత రక్షణ..........5
శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రవైభవం..........11
అన్నాసాహెబ్ దాబోల్కర్..........14
సుందరీకాండ..........18
షిరిడీసాయీ హారతుల వైశిష్టం మరియు వైభవం..........25
మహనీయులందు అతీతుడు శ్రీసాయి..........30
శ్రీశ్రీశ్రీగణేశ్‌నాథ్‌మహారాజ్ సాయిబాబా గూర్చి చేసిన ప్రసంగం..........31
శ్రీసాయినాథుని వచనాలు..........35
ప్రార్థన మా అభ్యర్థన..........36
సాయినాథ ఉవాచ..........37
అష్టగణపతి క్షేత్రములు ..........44
శ్రీలలితా సహస్రనామములు..........46
భక్తిభావము..........48
ధర్మం..........51
సత్సంగ మహిమ..........55
ఆధ్యాత్మికజీవనానికి సహాయకారులు..........58
ప్రేమే దైవం దైవమే ప్రేమ..........61
వార్తలు..........63






శ్రీసాయినాథాయనమః

సమస్త సద్గుణ సంపత్తి యొక్క నిక్షేపగని "భక్తి". భక్తిభావం లేనిదే ఏ మనిషి ప్రగతని, సద్గతిని సాధించలేడు.

భక్తి భగవంతుని సంబంధమై భగవంతుని చేరు ఉత్తమ మార్గము.


రక్షిష్యతీతవిశ్వాసః : భగవంతుడు తనను రక్షిస్తాడను విశ్వాసమే భక్తి.

పాపలన్నింటినీ పటాపంచలు చేయుశక్తి భక్తికేయున్నది.

భక్తుల హృదయాలే భగవంతుని నివాసాలు. భక్తిసాధనకు శ్రద్ధ. ఏకాగ్రతలు అత్యవసరం.

భక్తుడు భగవంతునిలో లయమై, నిత్య శాంతిని పొందుతాడు. ఇది భక్తిముఖ్య లక్షణం.

తీర్థయాత్ర, తపస్సు, యజ్ఞము మున్నగువాటి కన్న సత్సాంగత్యము వలన మాలిన్యం త్వరగా నశిస్తుంది. భక్తితో ఏది సమర్పించినను భగవంతుడు అనుగ్రహిస్తాడు.



# శ్రీసాయిసద్గురు సమర్థ-సగుణోపాసన

మూలం :- శ్రీకృష్ణారావ్ జోగేశ్వర్ భీష్మ అనుసరణ : నైనారు అప్పాస్వామి

ప్రథమ భాగం- కాకడ ఆరతి 9 (గత సంచిక తరువాత భాగం)

(ఉదయం 5.00గం॥లకు నేయితో ముంచిన చేదివిటీలతో ఆరతి ఇస్తూ ఆలపించు ప్రార్థన)

## దయతోడ మము జూడు పాట - 10

ఓ సాయిబాబా ! దయతో మము జూడు దేవా !
మీ బిడ్డలము మేము, కాపాడు దేవా ! ॥ ఓ సాయి ॥

1. భ్రమతోడ నిండిన ఈ భౌతికలోకాన్ని
నీ వెరుగుదువు దేవా ! ॥ ఓ సాయి ॥
2. నీ భక్తుడ నేనజ్ఞానిని
దైవదర్శన మిమ్ము దేవా ॥ ఓ సాయి ॥
3. "నేనిప్పుడేమి చెప్పాలని" దాసుగానంటాడు
నా నాల్కపల్క లేదో దేవా ! ॥ ఓ సాయి ॥

## పాట - 11

దయతోడ నను జూడుమో సాయీ !
ఓ నా సాయీ ! నా కెవరు లేరు మీరు దప్ప
తల్లి లేదు, తండ్రి లేదు, సోదరుడు లేడు
నను దయజూడుమో దేవా !

1. నేను నీ భక్తుడను, అజ్ఞానినో దేవా !
నాకేమి తెలియదు దైవాన్ని గూర్చి
ఆచారవిధులను గూర్చి,
దయతోడ జూడుమో దేవా !
2. జీవితాన్నంతా వ్యర్థపరచాను
అంతిమయాత్రలో చిరమిత్రుడెవరు లేడు
దయతోడ జూడుమో సాయిదేవా !
3. నేను గాణాను, మీ మసీదు చీపురను,
ఓ సాయిదేవా ! మీరు మా ప్రభువులు
దయతోడ జూడుమో దేవా ! (సశేషం)



# శరణాగత రక్షణ

-కొప్పిశెట్టి సూర్యనారాయణ, పి.ధర్మవరం, విశాఖజిల్లా





సర్వసృష్టికే అధినాయకుడైన భగవంతుడు తన్ను శరణు పొందినవారిని రక్షించడం ఆయన బాధ్యత ! ఆ పరమాత్ముని మహిమలను అర్థంచేసుకొని, ఈ సకల జీవుల్లో అంతర్గతంగా ఉన్న ఆయన తత్త్వాని గ్రహించి, తన బాధల్లో అసహాయుడై, అన్నిటినీ ఆయన మీదే మోపి, ఆశ్రయించినవాడే నిజమైన భక్తుడు. అటువంటి జ్ఞానిని రక్షించడం ఆయన ధర్మము కదా !

అయితే అటువంటి లోకేశ్వరుని త్రికరణశుద్ధిగా నమ్మితే చాలు ! నోరు విడిచి, మనం ఆయనను దేనినీ అర్థించనక్కరలేదు ! తనపై పూర్తి విశ్వాసముంచిన శరణాగతులకు ఏది కావాలో, దేనిని ఇస్తే వారికి మేలు కలుగుతుందో ఆయనకు తెలిసినంతగా మనకు తెలియదు గదా ! మన బిడ్డల జీవితాలు సుఖశాంతులతో ఉండాలంటే వారికేది కావాలో మనకు తెలిసినంతగా మన బిడ్డలు గ్రహించలేరు అనేది వాస్తవమే గదా ! కాబట్టి మనం మన దైవాన్ని ఆశ్రయిస్తే చాలు - అకుంఠిత విశ్వాసంతో !

శ్రీకృష్ణపరమాత్మ తనను ఆశ్రయించి, శరణాగతుడైన కుచేలుని అనుగ్రహించిన తీరును మననం చేసుకొందాం. కుచేలుడు శ్రీకృష్ణునకు బాల్య

సఖుడు. ఆయన జ్ఞాని. బ్రహ్మవేత్త ! కాని దారిద్ర్యబాధతో దీనమైన జీవనాన్ని గడుపుతున్నాడు. పిల్లలు, భార్య, తాను ఆకలితో మల మల మాడిపోతున్నారు. ఇలా ఎన్నో ఏండ్లు నుండి భరిస్తూనే ఉన్నాడు. కాని ఇలాంటి దీన సమస్యకు పరిష్కారాన్ని ఏనాడూ ఊహించలేకపోయాడు ! ఒకనాడు ఆయన భార్య విచారంతో అతనిని సమీపించి, "నాథా ! మనం ఎన్నాళ్ళనుండో ఈ కటిక పేదరికాన్ని అనుభవిస్తూ ఉన్నాం. ఆ శ్రీకృష్ణపరమాత్మ సాక్షాత్తూ మీ బాల్యమిత్రుడిని అంటూ ఉంటారు గదా! మనం ఆయనను ఆశ్రయించి, ఆయన కటాక్షాన్ని పొందవచ్చు గదా" అని విన్నవించగా, ఆ పరమాత్మ సందర్శనం ఇహపరసాధకం అవుతుందని మెఱుపువలె ఒక ఊహ రాగా వెంటనే బయలుదేరడానికి సిద్ధం అయ్యాడు. అటువంటి మహానుభావుని దర్శనానికి ఖాళీ చేతులతో వెళ్లటానికి మనస్సు అంగీకరించక, ఎప్పటివో కుండ అడుగున మిగిలియున్న అటుకుల్ని వెతికారు. తన చినిగిపోయిన పంచను ఎన్నో మడతలు పెట్టి, వాటిని మూటగట్టి, ఆ గోవిందుని వద్దకు బయలుదేరాడు.

కాని అచట ద్వారపాలకులు "నన్ను లోపలికి రానిస్తారా? నన్ను పోల్చుకొని, ఆదరిస్తాడా?" అని అనేక సందేహాలతోనే ద్వారకాపుర ప్రవేశం చేసాడు కుచేలుడు !

తన బాల్యస్నేహితుడు కుచేలుని అల్లంత దూరంగా చూచి, ఆ లీలామానుష విగ్రహుడైన దేవదేవుడు తన ఆసనం నుండి గభాలున దిగి, ఆప్యాయతతో ఎదురుగా వెళ్లి, తన్మయత్వంతో కౌగిలించుకొని, సాదరముగా తీసుకొనివచ్చి, తన తల్పం మీద కూర్చుండబెట్టాడు ! బంగారు పాత్రలో, నీటితో వాత్సల్యంగా కుచేలుని కాళ్లు కడిగి, ఆ నీటిని తన శిరస్సుమీద



చల్లుకొన్నాడట! సుగంధ ద్రవ్యాలను తన ప్రియమిత్రుని శరీరానికి అలది, విసన కర్రతో విసరి ఆయనను సేదతీర్చాడు ఆ సర్వలోకారాధ్యుడు.

ఇదేమి వింత ? ఒక సామాన్య విప్రుణ్ణి ద్వారకాసామ్రాజ్యాధి నేత, జీవేశ్వరుడు శ్రీకృష్ణపరమాత్మ ఇంతగా సేవించడం. అది ఎన్ని జన్మల సుకృతమో ! అని అనుకోవద్దు సుమా ! కుచేలుడు ఆ ప్రభువును అచంచల విశ్వాసంతో ఆశ్రయించాడు. నిష్ఠతో శరణాగతిని పొందాడు. అది చాలు ! ఈ ఒక్క సుకృతమే చాలు ! ఆ శరణాగతియే భగవంతునికి కావలసింది! మరి అలాంటి భక్తులను రక్షించకుండా ఉండగలడా?

తాత్యాకు, మహల్సాపతికి లోకేశ్వరుడైన సాయి కాళ్లు పట్టలేదా? వారు కుచేలుని వలె సిగ్గుతో వారించగా, "ఫరవాలేదులే ! మీకు, నాకు తేడా ఏముంది? మీ కంటె నేను గొప్పవాడ్ని కానులే!" అని మందలించలేదా? భగవంతునికీ, భక్తునికీ మధ్య ఎట్టి తారతమ్యాలు లేవని, ఉండకూడదనీ, ఆయన భగవంతుని తత్త్వాన్ని మనకు ఆ విధంగా బోధించాడు – సాయి పరాత్పరుడు !

వారిద్దరు తాము పూర్వము గురుమందిరంలో గడిపిన పనులను తలచుకుంటూ, చిఱునవ్వుతో కుచేలునితో "నాకు కానుకగా ఏ పదార్థములు తెచ్చితి"వని అడిగి, అతడు సిగ్గుపడుతుండగా, మూట విప్పి, భక్తితో తెచ్చిన అటుకులను ఆనంద పరవశత్వంతో భుజించాడు పరమాత్మ ! అప్పుడంటున్నాడు. "మిత్రమా ! ఇన్నాళ్లు నేను నీకు జ్ఞాపకం రాలేదా? నీకు వేటి మీదా మనస్సు లగ్నం కాలేదా!" అని ! నిజమే, ఆయన్ని మర్చిపోయి, తీరని దారిద్ర్యాన్ని అనుభవించాడు !

ఎటువంటివారు భగవంతునికి ఇష్టులో, ఉత్తములో ఆయన మాటల్లోనే గ్రహిద్దాం !

"మనంబుల కామమోహితులుగాక, అర్థిమై యుక్త కర్మంబులాచరించి, ప్రకృతి సంబంధములు పాసి, "భవ్యనిష్ఠ" దవిలి యుందరు కొందఱుత్తములు భువిని" అంటాడు ! (భాగవతం).

అంటే – కోరికలను విడిచి, ఆయన అప్పగించిన కర్మలను ఆచరిస్తూనే అన్ని బంధాలను విడిచిపెట్టి, గొప్పనిష్ఠను (భవ్యనిష్ఠ) కలిగియుండే ఉత్తములు కొందరు మాత్రమే ఉంటారట ! కుచేలునిలో పైన చెప్పిన గుణాలన్నీ ఉన్నాయి. చివరిదైన 'నిష్ఠ' తప్ప ! అదైనా ఈనాటికి తన సహధర్మచారిణి చెబితే తప్ప ఆయనకు ఇంతవరకూ అది కలుగలేదు ! ఆ నిష్ఠ కలిగిన పుణ్యాత్ములకు వారి చరిత్ర దేదీప్యమానమే !

సాయీశ్వరుడు తన భక్తుల్ని అడిగే దక్షిణల్లో 'ఈ నిష్ఠకే ఎక్కువ ప్రాధాన్యత ఉందని అనేక సందర్భాలలో సూచించడం జరిగింది.

ఆ విధముగా తెలుపుతూ 'గురువు' అనే పరమమోక్షదాయకమైన పదము యొక్క గొప్పతనాన్ని తన సఖునితో చెప్పుచున్నాడు పరమాత్మ –

"ఎఱుగుదులె ? మనము గురు మం
దిరమున వసియించి, అతడు తెలుపగ వరుసన్
ఎఱుగగ వలసిన యర్థము
వెఱిగి పరిజ్ఞాన మహిమ లెఱుగుట లెల్లన్ ॥ (భాగవతం)

అంటాడు. పరమగురువైన పరమాత్మకు కూడా 'గురువు' వున్నాడా? ఉన్నాడు ! ఆ మహానుభావుడే 'సాందీపని ! వీరిద్దరూ ఆ గురూత్తముని యింట తెలుసుకోవలసిన 'పరిజ్ఞాన మహిమల్ని' తెలుసుకొన్నారట !



"తివిరి యజ్ఞాన తిమిర ప్రదీపమగుచు
అవ్యయంబైన బ్రహ్మంబుననుభవించు"...

అటువంటి గురువువద్ద అజ్ఞానమనే చీకట్లను పోగొట్టుకున్నారట. సాయినాథుడు గురువు యొక్క ఔన్నత్యాన్ని తెలుపుతూ, ఆయన్ని ఎలా సేవించాలో వివరంగా చాలా సందర్భాల్లో తెలిపాడు. కృష్ణపరమాత్మ అంటాడు – "నేను సకల వర్ణాశ్రమంబులవారికి విజ్ఞాన ప్రదుండనై యుండియు, 'గురుభజనంబు పరమధర్మంబు అని ఆచరించితిని" అని ఎట్టివారికైనా గురుసేవ పరమధర్మమనియే, సాయి కూడా తన గురువును ఎన్ని బాధలకోర్చి, ఏ విధంగా సేవిస్తే తానింతటి పరమోన్నతస్థానాన్ని పొందగలిగాడో వివరించడం జరిగింది !

పరమాత్మ తన గురుసేవా నిరతిని కుచేలునితో జ్ఞాపకం తెచ్చుకొంటూ – "మిత్రమా ! మనం ఒక్కసారి గురుపత్ని పంపగా ఇంధనాల (వంటచెఱుకు) కోసం అడవికి వెళ్లినప్పుడు గొప్ప మేఘాలు, మెఱుపులు, ఉరుములతో భయంకర వర్షం కురవగా, త్రోవ కనబడక రాత్రంతా చీకటిలో నడిచి, వానలో తడిసి వస్తుండగా తెల్లవారుతుండగా మన గురువుగారు వచ్చి, తీసుకువెళ్ళారు గదా" అని చెప్పాడంటే గురుసేవ యొక్క గొప్పతనాన్ని మనకు తెలియజేయడమే !

ఏది ఏమైనా కుచేలుడి చేరవలసిన స్థానానికే చేరాడు ! కాని, నోరారా తన కేమి కావాలో తన సతీమణి ఇంతదూరం ఎందుకు పంపిందో ఆ మహాత్మునికి చివరకు విన్నవించుకోకుండానే, మరునాడు వేకువన లేచి, కాలకృత్యాలు తీర్చుకుని తన ఇంటికి బయలుదేరాడు ! చిరునవ్వుతోనే పరమాత్మ తన మిత్రుని సాగనంపినాడు కాని ఆ ఘటనా ఘటన సమర్థుడు తన మిత్రునకు ప్రసాదించబోయే భాగ్యోన్నతిని తెలియజేయలేదు !

తన గ్రామ పరిసరాలకు వచ్చి తన గృహాన్ని వెతుకుతున్నాడు కుచేలుడు. ఆశ్చర్యం ! సకల వైభవోపేతమైన రాజమందిరాలు, పరిచారికలతో కళ కళ లాడుతున్నది తన పూర్వపు నివాసమేనా ! తన భార్యామణి రాజ్ఞి ! పుత్రులు రాజకుమారులు! ఈయన రాకకోసం ఎదురుచూస్తూ లోపలికి ఆహ్వానించారు! ఇంకేం ! సమస్తభోగాలు ముంగిటకే వచ్చాయి ! ఆ మహాత్ముడు భక్తుడు తెలిపితేనే గాని గ్రహించలేడా? తన ఆశ్రితులకు ఏమి కావాలో అడిగితేనే గాని ఈయడా ! తనను ఆశ్రయిస్తే చాలు. ఆ ఆర్తత్రాణపరాయణుడు మనకేం కావాలో వాటిని అనుగ్రహిస్తాడు.

భక్తులారా ! పరమగురూత్తముడైన సాయి పరాత్పరుడు ఇలాంటి విషయాలను భక్తులకు ఎన్నో రీతుల నర్మగర్భితంగా బోధిస్తూ, మన బాధలను ఆయన మోస్తూ, సర్వమానవాళిని సరియైన ధర్మమార్గంలో నడిపించే బాధ్యతను పూని, షిరిడీ పవిత్ర భూముల్లో సంచరించడం, సర్వమతసమ్మతమైన జీవన విధానాన్ని అందించి, మనల్ని కృతార్థులను చేయడం, మనం అటువంటి మహోన్నతుని ఆరాధించగలగడం మన పుణ్య విశేషము !

"నిష్ఠ, విశ్వాసములతోడ నియతి గొలచి,
జ్ఞానదీప్తితో ననుగాంచ పూనుకొనము
భానుడుదయింప చీకటుల్ పాఱునటుల
చింత లుడిగింతు, నేను నీ చెంతనుండి."

అని మనకు అభయమిచ్చిన షిరిడీశుని మనసారా ధ్యానిస్తూ సుఖశాంతుల నొంది తరిద్దాం !

శ్రీ సమర్థ సద్గురు సాయినాథ్ మహారాజ్‌కీ జై !



# శ్రీ విష్ణుసహస్రనామస్తోత్ర వైభవం

సేకరణ : యం. వెంకటరావు, న్యూపాల్వంచ



శ్రీవాల్మీకి మహర్షి ప్రణీతమైన శ్రీరామాయణము, వేదవ్యాస భాగవానుడు అనుగ్రహించిన శ్రీమద్భారతము, భారతీయ సాంస్కృతిక ఇతిహాసాలు శ్రీమద్భారతానికి శ్రీకృష్ణభగవానుడు అనుగ్రహించిన 'శ్రీమద్భవగీత వలనను, భీష్మ పితామహుడు లోకానికి ప్రసాదించిన 'శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రము' వలనను గౌరవము లభించినదను విషయము పెద్దలు చెప్పుదురు. శ్రీకృష్ణుడు అర్జునునకు ఉపదేశము చేసి సంజయుని ద్వారా లోకానికి అందించాడు 'భగవద్గీత'.

భారతసంగ్రామానంతరం అంపశయ్యపై పడియుండిన భీష్మపితామహుని ద్వారా శ్రీకృష్ణ పరమాత్మ పాండవులకు ఉపదేశం చేయిస్తూ లోకాన్ని 'శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రము'చే తరింపజేసాడు. ఈ రెండింటిలో భగవద్గీత కంటె 'శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రము' వలననే సులభంగా తరింపవచ్చుని శ్రీకృష్ణుని అభిమతం. ఈ భావాన్ని శ్రీకృష్ణుడే స్వయంగా వ్యక్తం చేసాడు భీష్మపితామహుని దగ్గర శ్రీకృష్ణుడు పాండవులనందరినీ తీసుకుని భారతసంగ్రామానంతరం అంపశయ్యపైయున్న భీష్మపితామహుని దగ్గరకు వస్తాడు. ధర్మరాజుకు కలిగిన ధర్మసంశయములను తీర్చమని శ్రీకృష్ణుడు, భీష్ముని కోరుతాడు. తనకు అవేవీ జ్ఞాపకం లేవు. చెప్పే శక్తి లేదంటాడు భీష్ముడు. అతనికి తెలిసినవన్నీ జ్ఞాపకం వచ్చేటట్లు, పూర్వపు

శక్తి కలుగునట్లు, నోటనీరురునట్లు, దేహబాధ తెలియనట్లుగ వరాలిస్తాడు శ్రీకృష్ణుడు. ఆశ్చర్య, ఆనందాలతో భీష్ముడు “అన్ని వరాలు నాకిచ్చి నాచే చెప్పించడమెందుకు కృష్ణా! నీవే చెప్పవచ్చు గదా?” అని ప్రశ్నిస్తాడు.

భారతసంగ్రామంలో యిరుసేనలను ఆపి మరీ చెప్పాను ‘భగవద్గీత’నంతాను. విన్న అర్జునునకు ‘భగవద్గీత’ ఏ మాత్రం బోధపడలేదు. లోకంలో ఎవరైనా తనను గురించి తనే చెప్పుకుంటే పొగుడుకుంటున్నారని అనుకుంటారు. ఎదుటివారు గుర్తించి పొగిడేతే లోకం కూడా ఆ గొప్పదనాన్ని అంగీకరిస్తుంది. ఒక తత్త్వాన్ని గూర్చి తత్త్వదర్శనం చేసినవారు చెప్పాలేగాని, తత్త్వము తన గురించి తాను చెప్పుకోరాదు గదా ! భగవద్గీతలో పరతత్త్వమైన నా ప్రభావాన్ని నేనే కీర్తించుకోవడం చేత అర్జునునకు ఏ మాత్రం బోధపడియుండదు.

‘భీష్మపితామహా ! నీవు తత్త్వ దర్శనంచేసిన ఆచార్యుడవు.నీ నుంచి తెలుసుకోవాలని పాండవులు కోరుతున్నారు. వారికి తత్త్వమును, హితమును ఉపదేశము చేయి” అంటాడు శ్రీకృష్ణుడు. “దాహం కలిగినవానికి సముద్రం తనలో నీరు నిండుగావున్నా, యివ్వటానికి వీలులేదు. యిచ్చినా నీరు త్రాగడానికి పనికిరావు. ఆ నీటినే మేఘము గ్రహించి, వర్షంగా కురిపిస్తేనే త్రాగ వీలవుతుంది.”

**శ్రీకృష్ణుడు సముద్రం లాంటివాడు. అతని గుణప్రవహాన్ని గ్రహించిన భీష్ముడు మేఘములాంటవాడు.** కనుక శ్రీకృష్ణుడు వరాలిచ్చి అతనిని ప్రోత్సహించాడు. పైగా కృష్ణుడు లోకంలో నన్ను జ్ఞానిగా గౌరవించడం గొప్పకానేకాదు. నీవు జ్ఞానివి, తత్త్వదర్శివి.” అనేది లోకం గుర్తించడం అవసరం. ఆ గర్తుంపు నీకు కల్గించాలన్నదే నా అభిప్రాయము” అని భీష్ముడిని ప్రేరేపిస్తాడు.

పాండవులకు ఉపదేశం చేస్తూంటే తాను కూడా చేతులు కట్టుకొని,



విని “అది అట్లే” అని ఆమోదిస్తాడు. అందుచేత శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రమునకు ప్రభావమధికము.

శ్రీవిష్ణుసహస్రనామం ఎంత ప్రాచుర్యమైనదో మనకందరికీ తెలుసు. వాస్తవానికి ప్రతి ఒక్క భక్తుడూ ఉపనిషత్తు, భగవద్గీత, పురుషసూక్తం, శ్రీవిష్ణుసహస్రనామాలను అను నిత్యం పఠించాలని, ప్రాచీన హిందూ సంప్రదాయమునకు చెబుతోంది. వీటన్నిటినీ పారాయణ చేయడం కుదరకపోయినా ‘శ్రీవిష్ణుసహస్రనామావళి’ని పఠించినా సరిపోతుందని ఆస్తికుల నమ్మకం. ఎవరైనా, ఏ సమయంలోనైనా దీని పఠించవచ్చు. విష్ణుసహస్రనామపఠనానికి ప్రత్యేకించి చేయాల్సిన వైదికకర్మలు కూడా ఏవీ లేవు. శ్రేయస్సు, సుఖాలు పొందాలనుకొన్న ప్రతిమానవుడూ, ఈ నామావళిని పారాయణము చేయుచూ, అందలి అర్థాన్ని, పరమార్థమును, నిగూఢార్థాన్ని మననము చేసికొనుచు, తత్త్వానుభవము కలిగియుండిన సకల శుభములు నెరవేరుననుటలో నెంతమాత్రము సందియము లేదు. అన్ని కోరికలనూ, ఈడేర్చే మహత్తర మంత్రాలు ఈ ‘విష్ణుసహస్రనామావళి’లో ఉన్నాయి.

మచ్చునకు కొన్ని :

1. సర్వసంపదల సంప్రాప్తమునకై – **ఓం శ్రీ విభావనాయ నమః**
2. మేధాశక్తికీ, విద్యాప్రాప్తికి – **ఓం సుమేధసే నమః**
3. శత్రునాశనానికి – **ఓం శత్రుతాపనాయ నమః**
4. సర్వాది భయనివృత్తికి – **ఓం సుపర్ణాయ నమః**
6. దుస్స్వప్ననాశనానికి – **ఓం దుస్స్వప్ననాశనాయ నమః**
7. గ్రహపీడాది సర్వభయ నివృత్తికి –**ఓం సర్వప్రహరణాయుధాయ నమః**

కాబట్టి సాధకులు విజ్ఞుల ద్వారా ఆ మంత్రపూతమైన నామాలు జపించి తరింపవచ్చును. ఓం తత సత్

□□□□□□□□□□□□□□□□□□

(చరణ్ జనమంచి రచించిన 'సాయిభక్తమాల' అను గ్రంథము ఆధారంగా.... )

# 2. అన్నాసాహెబ్ దాభోల్కర్

**చరణ్ జనమంచి**

*(గత సంచిక తరువాత భాగం)*



అన్నాసాహెబ్ స్నేహితులు నానా సాహెబ్ చాందోర్కర్, కాకాసాహెబ్‌దీక్షిత్ షిరిడీ యందుగల సాయినాథుని దర్శించుకోమని పలుమార్లు ప్రోత్సహించినా అన్నాసాహెబ్ విముఖత ప్రదర్శించెను. చివరికి 1910లో షిరిడీకి వెళ్లెను. అన్నాసాహెబ్ సాయిబాబాను చూసి తన స్నేహితులు చెప్పిన దానికంటే వెయ్యి రెట్లు ఆనందం పొందెను.

సాఠేవాడలో బాలాసాహెబ్ బాటేకు అన్నాసాహెబ్‌తో 'గురు ఆవశ్యకత' అను విషయముపై వాదన జరిగెను. అన్నాసాహెబ్ మధ్యాహ్నవేళ ఆరతికి ద్వారకామాయి చేరగా బాబా కాకాసాహెబ్‌దీక్షిత్‌తో అన్నాసాహెబ్ వంక చూస్తూ "ఈ హేమాడ్‌పంత్ ఏమంటున్నాడు?" అని ప్రశ్నించెను. అన్నాసాహెబ్ తనలో తాను సాయిబాబాకు మా వివాదం ఎలా తెలుసు? అని ఆశ్చర్యపోతూ సాయిబాబా సర్వజ్ఞుడని తెలుసుకొనెను.

హేమాడ్‌పంత్ సాయిబాబాను వర్ణిస్తూ, వారిచే అనుగ్రహం పొందిన భక్తుల గూర్చి ఒక పుస్తకం వ్రాయదలచి, తనలో తాను, నాకు యోగులచరిత్ర చదివిన అనుభవం ఉన్నను సాయిబాబాచరిత్ర వ్రాసే జ్ఞానం లేదు. గురువుని సరిగ్గా పూజించడమే తెలియనివాణ్ణి, వారి గూర్చి పుస్తకం వ్రాయటం సాధ్యమా?



ఆ దేవుని కృప లేక ఒక్క అడుగు కూడ వేయలేనివాణ్ణి వాన్ని అని ఎన్నో విధములుగా ఆలోచించసాగెను. శ్యామా ద్వారా తన మనసులోని వేదన, బాబా ముందు ఉంచెను. హేమాడ్‌పంత్‌ను బాబా చెంతకు పిలిచి "భక్తుల అనుభవాలను సేకరించు. నువ్వు కేవలం నిమిత్రమాత్రుడవు" అని ధైర్యం చెప్పి, "నా సహాయ సహకారాలు నీకు ఎప్పుడూ ఉంటాయి" అని ఊధీనిచ్చి ఆశీర్వదించెను.

సాఠే అను అతనికి వ్యాపారంలో నష్టం వచ్చి అశాంతికిలోనై, 1917లో షిరిడీ వచ్చెను. సాఠే గురుచరిత్రము పారాయణ మొదలుపెట్టి 7 రోజులలో పూర్తిచేసెను. సాఠేకు బాబా స్వప్నంలో కనబడి మరొక్కసారి పారాయణ చేయుమని చెప్పిరి. సాఠేకు సందేహం కలిగి బాబాను సంప్రదించగా మరోసారి పారాయణచేస్తే నీ కష్టాలు తొలగి మనసు కుదుటపడును అని బాబా దీవించెను. ప్రక్కనే ఉండి గమనిస్తున్న హేమాడ్‌పంత్, నేను ఎన్నో సంవత్సరముల నుంచి ఎన్నోసార్లు పారాయణచేసిన నాకు అనుగ్రహం కలుగలేదు, ఒక వారంలోనే సాఠేకు అనుగ్రహం కలిగెనని హేమాడ్‌పంత్ అనుకున్నాడు. హేమాడ్‌పంత్ మనస్సున ఆ ఆలోచన మెదలగానే, అతని మనస్సు బాబా కనిపెట్టి, శ్యామా ఇంటికి వెళ్లి శ్యామాను అడిగి దక్షిణ తెమ్మని ఆజ్ఞాపించిరి.

శ్యామా, హేమాడ్‌పంత్ కలిసి ఎంతోసేపు బాబా లీలలు వర్ణించు కుంటూ మాట్లాడుకున్నారు. శ్యామా శ్రీమతి రాధాబాయి దేశ్‌ముఖ్ కథ హేమాడ్‌పంత్‌కు ఇలా తెలిపెను. ఆమెకు బాబా మంత్రోపదేశం చేయ్యనిదే ఏమి తినను అని మొండిగా ప్రవర్తించెను. బాబా ఆమెను సమీపించి "ఓ తల్లీ! అనవసరంగా బాధపడతావు ఎందుకు? మా గురువుగారు మాకు ఏ మంత్రము చెప్పలేదు , భగవంతునిపై కేవలం శుద్ధమైన భక్తి, నమ్మకం చాలు" అని ఆమెకు భోదించెను. ఆమె దీక్ష విరమించుకున్నది అని శ్యామా కథ ముగించెను. అంతలో ద్వారకామాయి

నుంచి మధ్యాహ్న ఆరతి గంటశబ్దం వినబడగానే ఇద్దరు లేచి ద్వారకామాయికి బయలుదేరారు. హేమాడ్‌పంత్‌కు రాధాబాయి దేశ్‌ముఖ్ కథతో బాబాపై సంపూర్ణభక్తి, విశ్వాసములు కుదిరాయి. శ్యామాను అడిగి తెమ్మన్న రూ.15/-ల దక్షిణ బాబా హేమాడ్‌పంత్‌ను అడుగగా శ్యామా దక్షిణకు బదులు 15 నమస్కారాలు సమర్పించినట్లు హేమాడ్‌పంత్ తెలిపెను. "మీ సంభాషణ ఎలా సాగింది? ఆ కథలను ఎల్లప్పుడు మననం చేసుకొనుటచే శాంతిపొందెద'వని తెలిపి కలకండ ప్రసాదముగా హేమాడ్‌పంత్‌కు ఇచ్చెను.

ప్రతిఆదివారం షిరిడీచుట్టుప్రక్కల ఉన్న గ్రామపువర్తకులు వచ్చి షిరిడీలో సంత ఏర్పాటుచేయుదురు. ఆ రోజు ద్వారకామాయి జనసంద్రముతో కిటకిటలాడుతుండేది. హేమాడ్‌పంత్ బాబా పాదములు ఒత్తుచూ భగవన్నామస్మరణ చేయుచుండెను. శ్యామా, కాకాసాహెబ్‌దీక్షిత్, శ్రీమాన్ బూటీ, వామనరావు మొదలగువారు బాబా చెంత ఉండిరి. శ్యామా హేమాడ్‌పంత్ తో "నీ కోటుకు శెనగలు అంటియున్నవి" అనగా హేమాడ్‌పంత్ చేతిచొక్క కదిలించగా శెనగలు క్రిందపడెను. అప్పుడు బాబా "ఇతనికి (హేమాడ్‌పంత్) ఒంటరిగా తిను అలవాటు కలదు. ఈ దృశ్యమే దానికి ఉదాహరణము" అనగా "బాబా ! ఇంత వరకు నేను సంతకు వెళ్లలేదు. శెనగలు ఎలా కొనగలను? " అని తెలుపగా, బాబా "నువ్వు తినుటకు ముందు నన్ను తలచెదవా? నాకు అర్పించెదవా?" అని హేమాడ్‌పంత్‌ను అడిగిరి.

1917వ సం॥ హోళీపండుగనాడు హేమాడ్‌పంతునకు స్వప్నంలో బాబా కన్పించి తాను ఆనాడు ఇంటికి భోజనమునకు వచ్చెదనని చెప్పెను. మధ్యాహ్నం భోజనమునకు ఇంటి సపరివారమంతా సిద్ధంకాగా బాబా రాకకై ఎదురుచూసిరి. అప్పుడే సరిగ్గా ఆలీ మహమ్మద్, మౌలానా ఇస్మూముజావర్ చక్కని బాబా ఫోటో





హేమాడ్‌పంత్ ఇంటికి వచ్చి ఇచ్చిరి. బాబా కొరకు ఏర్పాటుచేసిన స్థలంలో దాన్ని ఉంచినారు. మరాఠీభాషలో సాయిసచ్చరిత వ్రాసి భక్తులకు సాయిబాబా గూర్చి తెలిపి సాయిసేవకు అంకితమైన హేమాడ్‌పంత్ నకు వందనములు.

## నమ్మినవారి దైవం

పర్వతం రేవతీప్రసాద్, ప్లాటునెం.115, డిఫెన్స్‌కాలనీ, సైనికపురి, సికింద్రాబాద్ - 500 094, ఫోన్ : 040-27113964



ప॥ నమ్మినవారికి దైవము నీవే - నాథా సాయినాథా ।
నీవే తోడు నీడగ ఉంటే - జగతిలో ఎవ్వరు అనాధా,
జగతిలో ఎవ్వరు అనాధా ॥ నమ్మిన ॥

చ ॥ భారమంతా మోసేటి భగవానుడవు నీవే ।
దారి, తెన్ను చూపేటి దయామయుడవు నీవే ।
సకల జనుల సంరక్షణ చేసే సర్వేశ్వరుడవు నీవే ।
సామాన్యులను మాన్యులుగా తీర్చిదిద్దే సిద్ధుడ నీవే । ॥ నమ్మిన ॥

చ ॥ విశ్వమానవ జ్యోతివి నీవని తెలుసుకొంటిమయ్యా ।
హృదయభారము దింపి మాపై కరుణ జూపినావయ్యా ।
విశ్వనాయకా! వేయినోళ్ళ నిను వినుతి చేతుమయ్యా ।
గుభాళించే గులాబీల మాలలు వేసెదమయ్యా ।
మరువమయ్యా సాయీ నిను,
మేమరువమయ్యా సాయీ ॥ నమ్మిన ॥

*శ్రీ తిరుమలశెట్టి వెంకట సుబ్బారావుగారు, వ్యవస్థాపకులు, శ్రీషిరిడీసాయిమందిరం, కొవ్వాద (తూర్పుగోదావరి జిల్లా) వారిచే ప్రచురింపబడిన –*

**– యం.పి.సాయినాథ్,** *ప్లాట్ నెం.32, సాయినగర్ కాలనీ, గాంధీనగర్, హైద్రాబాద్–80, ఫోన్ : 2753 4805*

*గత సంచిక తరువాత భాగం*

## ఏకాత్మ స్వరూపులు :



ఒకసారి వామన్, సాయిబాబా తనకు స్వయంగా మామిడిపండు ఇస్తేగాని తినకూడదని నిర్ణయించుకున్నాడు. మామిడిపండ్ల కాలం అయిపోతోంది. ఆయన ఎంతగా తినాలనుకున్నా కుదరలేదు. సీజను చివర్లో రాధాకృష్ణమాయి వామన్‌కు మామిడి పండురసం తీసుకోమని పట్టుపట్టింది. **రాధాకృష్ణమాయి సాయిబాబా ఏకాత్మస్వరూపులనే** భావం వామన్‌కు గట్టిగా ఉండేది. అందువలన ఆమె మాటను సాయి ఆజ్ఞాగా భావించి మామిడిరసం తీసుకొన్నాడు.

రేగే కూడా రాధాకృష్ణమాయి ద్వారానే సాయి సందేశాలు అందేవని తెలిపారు.





## కృష్ణదర్శనం :

వామన్ రాధాకృష్ణమాయి పాదాలకు శిరసు వంచి నమస్కరించేవాడు. ఒకనాడు ఆయనకు నుదిటిపైన సుందరమైన తిలకాన్ని నిలువుగా పెట్టుకున్న శ్రీకృష్ణదర్శనం లభించింది. తేజోమయ వస్త్రాలు ధరించిన శ్రీకృష్ణభగవానుని సుందరరూపం తన హృదయంలో శయనించినట్లు అనుభవమయింది. ఇవన్నీ రాధాకృష్ణమాయి పాదాలు పట్టుకొని ధ్యానం చేసిన దానికి పరిణామమని ఆయన విశ్వసించాడు.


## ప్రత్యక్ష దర్శనం :

వామన్ 7 రోజులు షిరిడీలో ఏకాంతంగా మౌనంగా గడిపాడు. ఆ సమయంలో రాధాకృష్ణమాయి పోలికలో ఉన్న ఒక గోపికా చరణాలు గాలిలో తేలిపోతూ కన్పించాయి. ఆమె ప్రత్యక్ష దర్శనమయింది ఆమెతో ఏమీ మాట్లాడలేదు. రాధాకృష్ణమాయి తనకు ఇష్టమయిన తుకారాంగాథలోని కొన్ని పేజీలతో సహా ఆయనకు దర్శనమిచ్చింది అని తన అనుభవాన్ని వామన్ (సాయిశరణానంద) వ్రాశాడు.

## మరోమారు ప్రత్యక్షదర్శనం :

ఒక భక్తుడి అర్థింపు కారణంగా, వామన్ “జయ జయ రామ కృష్ణహరి” అనే మంత్రాన్నిచ్చాడు. “అరే ! నేను యోగ్యతను చూడకుండా మంత్రానిచ్చాను. అందువల్ల భవిష్యత్తులో ఏదో ఒక శిక్ష అనుభవించవలసి వస్తుంది” అని

విచారంగా కూర్చున్నాడు. అప్పుడు రాధాకృష్ణమాయి తెల్లని వస్త్రాలు ధరించి, తెల్లని గుడ్డపేలికలు తీసుకొని పోతున్నట్లు దర్శనం అయింది. ఆమె ఆ దర్శనమిచ్చి "వామన్ ! నేను ధరించిన వస్త్రం నా చేతిలో నున్న పేలికలు రెండూ ఒకే స్వరూపంలో ఉన్నట్లే, నీ స్వరూపమూ, నా స్వరూపమూ ఒక్కటే. **నీవు మంత్రాన్ని యిస్తే అందులో నష్టమేముంది? నా ప్రేరణ స్ఫూర్తులతోనే అది జరిగింది. కనుక చింతించవద్దు"** అని తెలిపింది.



## సూక్ష్మరూపంలో ప్రయాణం :

రాధాకృష్ణమాయి తెప్పించిన వెండిదీపం సెమ్మెలలో నెయ్యి, వత్తులు వేసి, వాటిని ఒక పళ్ళెంలోపెట్టి ఆ సెమ్మెలలోని దీపాలను ద్వారకామాయిలో వెలిగించమని వామన్‌కు చెప్పింది. "చూడు. నేను ద్వారకామాయి మెట్లెక్కి పైకి వస్తున్నాను" అని కూడా అన్నది. వామన్ ద్వారకామాయికి వెళ్ళేటప్పుడు వీపుమీద చేతి స్పర్శ అయింది. వెనుకకు తిరిగిచూస్తే, ఆయనకు రాధాకృష్ణమాయి సూక్ష్మరూపంలో కన్పించింది. ఆమె పైకి వెళ్ళి, "సెమ్మెల్లో దీపాలు వెల్గించు" అన్నది. ఆమెను ఇంకెవరూ చూడలేదు. ఎందుకంటే ఆమె ద్వారకామాయికి వచ్చినట్లు ఎవరూ అనుకోలేదు. ఆమెను ఆ రూపంలో ద్వారకామాయిలో దర్శించటం, ఇతరులు ఆమెను చూడకపోవటం ఆయనను ఆశ్చర్యపరచింది.

దీనిని బట్టి **రాధాకృష్ణమాయి భౌతికంగా సాయిబాబా వద్దకు రానప్పటికి, సూక్ష్మరూపంలో సాయిచెంత ఉండేది.**





## సాయి అసలు తత్త్వాన్ని తెల్పిన బోధకురాలు :

ఒకసారి రాధాకృష్ణమాయి వలన సాయిబాబా అసలు తత్త్వం వామన్‌కు తెలిపింది. ఒకరోజు వామన్ ద్వారకామాయి వద్ద ఉండగా, రాధాకృష్ణమాయి గదిలోనుండి ఏదో శ్వాస వచ్చినట్లని పించింది. రాధాకృష్ణమాయి తన ప్రాణవాయువు లను సాయిబాబా మీదకు వదిలినట్లయింది. ఆ ప్రాణవాయువు విస్తరించి, సాయిబాబాగారి స్థానంలో రుద్రాక్షరూపధారి అంటే శివుని దర్శనమయింది. వామన్‌కు **సాయి శుద్ధబుద్ధ నిర్గుణ నిరంజన నిరాకారుడని** తెల్పినట్లయింది. మాయ యొక్క శ్వాసతో శివరూపం ప్రాప్తించిందని, ఆ శివరూపమే కఫ్నీ ధరించిన సాయిబాబా అని అర్థమయింది వామన్‌కు. ఈ అద్భుత అనుభవజ్ఞానం రాధాకృష్ణమాయి వలననే కదా!

## మనం సాయి ప్రతిరూపాలమే ! అసలు కాదు!:

రాధాకృష్ణమాయి వామన్‌రావుతో మాట్లాడుతూ "నీవు బాబాకు ప్రతిరూపానివి" అన్నది. ఆ మాటతో ఆయనకు సంతోషం కలుగలేదు. తన మనస్సులో "ప్రతిరూపం అవటంలో ఏం పురుషార్థం ఉంది? నేను అసలైన వాడిని కావాలి" అనుకున్నాడు వామన్. అంతర్జ్ఞానియైన రాధాకృష్ణమాయి ఆయన భావం గ్రహించింది. ఆ ఆలోచన తప్పు అని **"మనమందరం సాయి ప్రతిరూపాలమే (నకళ్ళు) అసలయినవారు బాబాయే"** అన్నది. సాధనలో,

గురువుసాయంతో ఉన్నత స్థితి చెందిన శిష్యునిలో ఉండేది గురుశక్తి మాత్రమే. ఆ గురుశక్తి ప్రకటితమయినప్పుడు గురుశిష్యులు ఒకటే అనే భావం కలుగవచ్చు. గురుశిష్యులు ఒకటికారు, వారు వారే వీరు వీరే అనే అర్థాన్ని ఆమె అలా తెలియచెప్పింది.

### యోగసిద్ధురాలు :

ఒకరోజు మధ్యాహ్నం రాధాకృష్ణమాయి ఒక పచ్చి మిరపకాయను ముఖానికి ఎదురుగా పట్టుకొని కూర్చుంది. అప్పుడు వామన్ ఆవిడవద్దకు వెళ్ళగానే ఆ మిరపకాయను యిచ్చి తినమంది. వామన్ ఆ మిరపకాయను నమిలి మింగేశాడు. కారంలేదు. అప్పటి నుండి వామన్‌కు అదృశ్యవస్తువులు కూడా కనిపించేవి. ఒక్కోసారి ఉన్నవి కూడా కనపడేవి కావు. యోగసిద్ధుడైన గురువు తాను మంత్రించిన మిరపకాయను శిష్యునికి యివ్వటం వలన అలా జరుగుతుంది. అంటే రాధాకృష్ణమాయి యోగసిద్ధురాలన్నమాటే !

ఒకసారి వామన్‌కు ఎంతసేపటికి నిద్ర రాకపోతే రాధాకృష్ణమాయి ధరించిన తెల్లని వస్త్రాన్ని ముట్టుకున్నాడు. ఆ వస్త్రం నుండి చల్లదనం ప్రసవించింది. వెంటనే ఆయనకు నిద్ర పట్టింది.

### యోగాగ్ని :

సాయికృపతో ఆమె అగ్నిని కూడా సృష్టించగల స్థితికి వచ్చింది. ఒకసారి వామన్ ఆమెకు కొద్ది దూరంలో నిలబడి వున్నాడు. రాధాకృష్ణమాయి తన చేతిలోనికి రాధాకృష్ణుల విగ్రహం తీసుకొన్నది. అగ్నిని ఆమె సృష్టించింది. విగ్రహం కూడా ఎర్రబడింది. దూరంగా వున్న వామన్ శరీరానికి ఆ అగ్నిజ్వాల సోకింది.



### అడగని ప్రశ్నలకు సమాధానాలు :

వామన్‌కు షిర్డీలో గీతా రహస్యం చదివేటప్పుడు అనేక ప్రశ్నలు ఆయన మనస్సులోకి వచ్చేవి. అప్పుడు ఆయన రాధాకృష్ణమాయి వద్దకు పోయి మామూలుగా మాట్లాడుతుంటే పరిష్కారంగాని ఆ ప్రశ్నలకి సమాధానాలు లభించేవి. ఆమెవద్దకు పోగానే నిగూఢప్రశ్నలకు సమాధానాలు దొరికేవి. ఆ ప్రశ్నలకు జవాబులు రాధాకృష్ణమాయి మాటల్లో తమంతతానే వచ్చేవి. దానికి ముందు గదిలో విద్యుత్‌లా మెరిసే తేజస్సు వచ్చేది.


### యధార్థ వాక్కు :

ఒకసారి వామన్ ఆమెతో తన స్నేహితుని జీతం 4 వందలని చెప్పాడు. అప్పుడు ఆమె "మనం చాలా బీదవాళ్ళమని నీవనకుంటున్నావో కాబోలు! నీకెంద జీతం కావాలి? యాభైయ్యా ? వందా? నూటయాభయ్యా ?" అన్నది అంతకుమించి అనలేదు. వామన్ ఉద్యోగంలో చేరాడు. జీతం రూ. 250, 275, 350 వరకు వచ్చింది. కొంతకాలం నిరుద్యోగికూడా ఉన్నాడు. తీరా లెక్కకట్టి చూస్తే నెలకు వచ్చింది సగటున నూటాయాభై రూపాయలే !

(ఇంకా ఉంది)


సాయిభక్తిమాల
అర్వైముగ్గురు భక్తుల జీవితచరిత్ర – 207 పుటలు
వెల రూ.40/- ప్రతి ఇంట వుండవలసిన గ్రంథం.
సత్సంగంలో పంచండి. ప్రతులకు –
శ్రీ సాయిదర్శన్, దమ్మాయిగూడ,
హైద్రాబాద్ - 500 083

# శిరిడిసాయి హారతుల వైశిష్టం మరియు వైభవం



డా॥ యం.కనకాచారి, ఇ.ఎఫ్.యల్.యు., హైద్రాబాద్

రోజు రోజుకు అన్యాయాలు, అరాచకాలు, అశాంతి, అయోమయాలు, అబద్ధాలు, అల్లకల్లోలాలు, ఆవేదనలు, ఆందోళనలు, ఆత్మహత్యలు ఎక్కువగుచున్న ఈ రోజుల్లో మనసుకు ప్రశాంతతే కనుమరుగైంది. కాని ప్రశాంతత లేని జీవితం అడవి కాచిన వెన్నెల అవుతుంది. మరి ఈ ప్రశాంతత ఎక్కడ దొరుకుతుంది? ఎలా దొరుకుతుంది? డబ్బులు చెల్లిస్తే సూపర్ మార్కెట్‌లో దొరికే వస్తువు కాదు. ఎవరో ఇచ్చేది కాదు. ఎవరికి వారే సంపాదించుకునేది. అది ఎలాగంటే... కేవలం ఆధ్యాత్మిక సాధనవలన మాత్రమే సాధ్యపడుతుంది. ఆధ్యాత్మిక సాధనలో ప్రశాంతత పొందడానికి అనేక మార్గాలు వున్నాయి. అందులో భగవంతునికి హారతి ఇస్తూ ఘంటానాదం మ్రోగిస్తూ హారతి పాటలు పాడుకోవడం ఒక ముఖ్యమైన సంప్రదాయం.

అలాంటి కోవకు చెందినవే శిరిడి సాయి హారతి పాటలు. వాటి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. వాటి అర్థం తెల్సినపుడే అవి మన హృదయాలలో ఆర్ద్రత కలిగిస్తాయి. ఆర్ద్రతలేని ఆరతి పాటలు పాడుతే అది ప్రార్థనే అనబడదు. కాబట్టి ప్రతి సాయిభక్తుడు వాటి అర్థాలను తెలుసుకొని పాడినపుడే అర్థవంతంగా, లాభదాయకంగా వుంటుంది.

“హారతి” అనునది సంస్కృతపదం. దీనినే తెలుగులో ‘ఆరతి’ అని అంటారు. ఆరతి అంటే “కర్పూరంతో జ్యోతిని వెలిగించి, భగవంతుని ముందు వినయవిధేయనమ్రతలతో నిలబడి భక్తి శ్రద్ధలతో ప్రార్థించుట అని అర్థం.



శిరిడీ సాయి హారతులు సాక్షాత్ సాయినాథుని పట్ల అపారమైన భక్తిని పెంచే సాధనాలు. సర్వదుఃఖాలను పోగొట్టే ఉపశమనాలు. ధైర్యసాహసాలను కలిగించే పనిముట్లు. కర్మ తీవ్రతలను తగ్గించే పరికరాలు. అవి బాబావారి నుండి పొందే అనుగ్రహ సోపానాలు. బాబావారు అందించిన ప్రసాదం. అంతే గాకుంగా హారతులు ఇటు భక్తులకు, అటు బాబావారికి మధ్య వారధులు. ఇవి సాయి భక్తులకు వేద మంత్రాలు. ఇది గమనించిన విదేశీయులు సైతం ఆయా దేశాల్లో శ్రీ శిరిడీసాయిబాబా వారికి ఆనందంగా హారతులు ఇస్తూ ఆయురారోగ్యాలను అష్టైశ్వర్యాలను పొందుతున్నారు. శిరిడీలో సాయిబాబాకు ప్రతి రోజు నాలుగు సమయాలలో నాలుగు పర్యాయాలు కాకడ హారతి (మేల్కొల్పునది), మధ్యాహ్నహారతి (భోజనం పెట్టునది), ధూప్ హారతి (సంధ్యా సమయం సూచించునది). శేజ్ హారతి (పవళింపజేసేది) ఇస్తారు. ఈ నాలుగు హారతుల వ్యవస్థ భారతదేశంలోని ఏ మహనీయులకు కూడా జరగడం లేదని విదేశీ పరిశోధకులు ఆర్థర్ ఆస్‌బర్న్ చేసిన సర్వేలో వెల్లడైంది. ఇలా ఇవ్వటానికి ప్రధానమైన కారకులు ఎవరని ఆలోచిస్తే శిరిడీసాయిలో ఐక్యమైన సిద్ధహస్తురాలు, విరాగిణి రాధాకృష్ణమాయి అని చెప్పక తప్పదు. ఆమెకు మనం ఎంతో ఋణపడివున్నాం. ఈ వ్యాసకర్త అహ్మద్‌నగర్‌లో ఆమె గురించి సమాచారసేకరణకై ఎంతో ప్రయత్నం చేశాడు. కోపర్గాంలోని గోదావరి నది ఒడ్డున ఈమెకు దహన సంస్కారాలు జరిగిన చోటులో ఏమైనా ఆనవాలు వున్నాయాయని పరిశోధించారు. కాని ఫలితం లేకపోయింది. అయితే ఆమె గురించి పుట్టు పుర్వోత్తరాలను, జీవిత విశేషాలను పరిశోధించి కొంతమేరకు

గ్రంథస్తం చేసిన సాయి భక్తాగ్రేసరుడు, శ్రీయం.పి.సాయినాథ్‌గారు ఎంతో ధన్యులు.

ఈనాడు మనం పాడుకుంటున్న శ్రీసాయిబాబా హారతులను వ్రాసిన మహానుభావులను, వ్రాసిన గీతాల సంఖ్యను పరిశీలించినట్లయితే మొత్తం 11 మంది. వారు 1. తుకారాం (5) , జానాబాయి (2), శ్రీకృష్ణ జగదీశ్వర్ భీష్మ (9), నామ్‌దేవ్ (2), దాసగణు (3), అడ్కర్ (1), మోహినీ రాజ్ (1), ఉపాసనీ మహరాజ్ (2), బి.వి.దేవ్ (1), రామజనార్ధనస్వామి (1), శ్రీ రామేశ్వర్ భావ్ (1). వీటితోపాటు మంత్రపుష్పం (1), సంప్రదాయ శ్లోకాలు (6). మొత్తం కలిపి (=35). అయితే 30 ఆరతి పాటలలో 25 మరాఠీలోను, 3 సంస్కృతంలోను, 2 హిందీలోను ఉన్నాయి. ఇవి నిజంగా మృధు మధుర భక్తిరసగుళికలు అని చెప్పవచ్చును.

1904లో అడ్కర్ మొట్టమొదటి **"ఆరతి సాయి బాబా సౌఖ్యదాతారా జీవా"** అనే పాటను వ్రాసి, బాబాకు భక్తితో సమర్పించారు. ఇక అటు తర్వాత వేరు వేరు కాలాలలో, వేరు వేరు సందర్భాలలో మిగతా భక్తులు వ్రాయడం జరిగింది. వీరందరూ కూడా ఎంతో పుణ్యజీవులు. వీరిని స్మరించుకొని మనం కూడా కొంత పుణ్యం కట్టుకుందాం.

ఇకపోతే శిరిడీలో బాబావారికి హారతులిచ్చే పద్ధతిని పరిశీలిస్తే మొదట ద్వారకామాయిలో భక్త తుకారాం, జ్ఞాన్‌దేవ్ పటాలకు పండుగ రోజుల్లో ఆరతి ఇచ్చేవారు. కాని కేవలం పండుగ రోజుల్లోనే గాకుండా ప్రతి రోజు కూడా నాలుగు హారతులనిచ్చే పద్ధతిని రాధాకృష్ణమాయి ప్రారంభింపచేసింది. వారి ఇరువురితో పాటు సాయి బాబాకు కూడా నాలుగు హారతులివ్వడం మొదలైంది. బాబావారికి హారతులివ్వడం 1910లో నూల్కర్‌తో



ప్రారంభించబడింది. వారు 1911లో చనిపోగా 1912 వరకు మేఘశ్యాముడు ఇచ్చేవాడు. 1912లో అతడు చనిపోగా జోగ్ కొనసాగించాడు. ఈ విధంగా 1910లో ప్రారంభింపబడిన సాయి హారతులు నేటివరకు అనగా దాదాపు 98 సం॥లు నిరాటంకముగా కొనసాగుతూనే వున్నాయంటే ఇది ఎంతో విశేషించదగిన అపూర్వ విషయం. అయితే ఈ మధ్య హారతి గీతాలను తెలుగులో కూడా తర్జుమాచేసి చదువుచున్నారు. కాని అంత రమణీయత కనిపించడం లేదు. బాబా సమక్షంలోనే మూడు భాషల్లో (సంస్కృతం, హిందీ, మరాఠీ)వున్న హారతి పాటలను ఒక రకమైన బాణిలో రాగయుక్తంగా పాడారు. బాబా వాటిని విని ఆనందించారు, అనుగ్రహించారు. కాబట్టి వాటిని ఆయా త్రివిధ భాషల్లోనే ఆయా రాగంలోనే పాడుకుంటేనే సమంజసంగా వుంటుంది. అది ఎంతో లాభదాయకం కూడాను. ఎందుకంటే ఆయా పాటల్లోని అక్షరాలలో ఎంతో అర్థం, పరమార్థం, సాయితత్త్వం (సమానత్వం, ప్రేమతత్వం, మానవత్వం) ఇమిడివుంది. ఈ హారతిపాటలను పాడుకోవడానికి ఒక సమయం నిర్ణయించబడింది. కాబట్టి వీటిని రాగయుక్తంగా, భావయుక్తంగా నిర్ణీత సమయానికి మొదలుపెట్టి చాలామంది కలిసి పాడినప్పుడు ఎంతో అద్భుతంగా, మనోహరంగా ఉల్లాసంగా ఉంటుంది. ఇలా సాయిబాబా ఆలయాలలో అనేకమంది భక్తులు కలిసి పాడుచూ వుంటారు. పాడేటప్పుడు తప్పులు చదువరాదు. కనీసం చదవటానికి రాకుంటే శ్రవణం చేయడం మేలు. అందుకే ఆలయాల్లో హారతి పుస్తకాలు అందుబాటులో వుంచుతారు. ఆ పుస్తకాలను చూచి పాడుకోవడం మంచిది. అలా అందరూ కలసి ముక్తకంఠంతో ఆ చక్కటి బాణిలో పాడుచున్నప్పుడు సాయి బాబా మన మధ్యలో వుండి

వింటున్నట్లు అనుభూతి కలుగుతుంది. ఆ అక్షరకుసుమాలలోని భావసౌరభాలు మనపై వెదజల్లబడుచూ వుంటాయి. ఉరికి గంతులేద్దామా ! అనిపిస్తుంది. డాన్స్ చేయాలనిపిస్తుంది.

అంతే గాకుండా ఈ హారతులను భక్తితో, శ్రద్ధతో, దివ్యప్రేమతో రోజూ పాడుకునేవారు శారీరకంగా, మానసికంగా పరిశుద్ధులవుతారు. పవిత్రులవుతారు. బాబావారి అనుగ్రహం తప్పక పొందుతారు. వారే గాకుండా వాటిని విన్నవారు కూడా అనుగ్రహం తప్పక పొంది తీరుతారు. మనం బాబా ముందు వినయపూర్వకముగా నమ్మకంతో నిలబడి పాడినట్లయితే లేదా కనీసం ఎవరైనా పాడుచుంటే విన్నట్లయితే, మనకు తెలియకుండానే భక్తిశ్రద్ధలు ఏర్పడుతాయి. భయాందోళనలు తొలగిపోతాయి. వివేక వైరాగ్యాలు ఏర్పడుతాయి. భ్రమలు మాయమవుతాయి. నిత్యశాంతి కలుగుతుంది. స్వయంగా ఈ విషయం బాబావారే శ్రీకృష్ణజోగీశ్వరభీష్మతో అన్నారు. అలా కొనసాగిస్తే కొంతకాలానికి బాబావారు ప్రత్యక్షంగా మన ముందు ఉన్నట్లు అనుభవంలోకి రావడం తథ్యం. కనీసం స్వప్న దర్శనం అయినా అవుతుంది. ఇందులో సందేహం లేదు.

సాయి హారతులపై ఎన్నో గ్రంథాలు వెలువడినాయి. క్యాసెట్లు, సి.డి.లు వచ్చాయి. శిరిడి సాయి సంస్థాన్‌వారు కూడా అమ్ముచున్నారు. కాని హారతిపాటలను క్షుణ్ణంగా విశ్లేషించి వాటిని సమగ్రమైన భావాలతో ఎవరూ కూడా విపులీకరించలేకపోయారు. ఇటీవల వెలువడిన "ఆరతి సాయిబాబా" (శ్రీ సాయి గణపతి ఆధ్యాత్మిక సత్సంగ సేవా సమితి, రాజమండ్రి వారి ప్రచురణ), 'శ్రీసాయి హారతులు' (శిరిడి సాయి తత్త్వప్రచారణ సమితి,



హైద్రాబాద్‌వారి ప్రచురణ), 'శిరిడి హారతులు' (శిరిడి సాయి బాబా మందిరం, కొవ్వాడ వారి ప్రచురణ) అనే గ్రంథాలు సాయిభక్తులు చదువుకోవడం ఎంతో మేలు.

ఇలాంటి వైభవం, వైశిష్ఠం కలిగివున్న సాయి హారతులు మనందరకు ఆలంబనాలు. శిరిడీలో బాబాకు హారతులు ఇచ్చే సమయాలలో భక్తులు తమ తమ ఇళ్లలో కూడా కుటుంబ సభ్యులు అందరు కలిసి హారతులు పాడుకున్నట్లయితే తప్పక సాయికి దగ్గర అవుతారు. సాయి అనుగ్రహానికి పాత్రులవుతారు. శిరిడికి వెళ్ళే భక్తులు మాత్రం తప్పనిసరిగా ఒక రోజును ఈ హారతులకే కేటాయించి నాలుగు హారతులలో పాల్గొనటం ఎంతో లాభదాయకం. నాలుగు ఆరతులలో పాల్గొనటం వలన ఆత్మానందం, ఆధ్యాత్మికానందం, పరమానందం, బ్రహ్మానందం పొందుతారు. ఒకవేళ ఎట్టి పరిస్థితిల్లో వీలులేకుంటే కనీసం ఒక హారతిలోనైన పాల్గొని ఒక రకమైన ఆనందాన్నైనా పొందిరావడం ఎంతో శ్రేయస్కరం. బాబావారి పటం ముందుగాని లేదా విగ్రహం ముందుగాని శ్రద్ధా సబూరీలతో నిలబడి హారతి ఇస్తూ హారతిపాటలు గొంతెత్తి పాడడం బాబాకు ఎంతో ఇష్టం. స్వయంగా వారే మైనతాయి ప్రసవ వేదన పడుచున్న సమయంలో ఊదీని, హారతి పాటను రాంగిరిబువాద్వారా నానాసాహెబ్‌కు పంపించిన విషయం మనందరకు తెలిసిందే. దీనిని బట్టి బాబావారికి హారతులు ఇచ్చి హారతి పాటలను పాడాలని సాయిభక్తులు తెలుసుకోవాలి. అలా చేస్తారని ఈ శిరిడీ భగవానుని అనుగ్రహాన్ని పొందుతారని ఆశిస్తూ, సాయిభక్తుల ఆధ్యాత్మిక జీవన స్రవంతిలో హారతి ఇవ్వడం మరియు హారతి పాటలు పాడుకోవడం లేదా వినడం ఒక అంతర్భాగం కావాలిని కోరుకుంటూ...

**– యం.కనకాచారి**



# మహనీయులందు అతీతుడు శ్రీసాయి

మన భారతదేశంలో అనేక ఋషులు, సిద్ధులు, సద్గురువులు, పావనమూర్తులు వెలసిన పుణ్యభూమి. నేరూరు యందు శ్రీసదాశివబ్రహ్మేంద్ర సరస్వతీ స్వామి, దక్షిణేశ్వరం నందు శ్రీరామకృష్ణపరమహంస, తిరువన్నామలై యందు శ్రీ రమణమహర్షి, శ్రీశేషాద్రి స్వామి, అజ్మీర్ యందు శ్రీ హజరత్ హుస్సేన్ బాబాజాన్, యింకనూ అనేకమంది ఆత్మానబోధము ఆత్మసంభావనము, పారమార్థిక సంభావనము పొందిన మహనీయులు అవతరించిరి. అట్టి మహనీయుల యందు నతీతుడు, నవరత్నముల యందు వజ్రము వంటివాడు శ్రీసాయినాథుడు. ఆయనకు ఆయనే సాటి. సామాన్యమానవులకు దూరముగా నుండక కలిమాయలో కష్టాలపాలై పడియున్న దీనులకాధారుడై, శరణు అన్నవారికి చేయూత నిచ్చి దరిజేర్చుతూ తన భక్తులకు సర్వకాలములందు కాపాడుచు వారి దైవచింతనము ద్విగుణీకృతము గావించుచున్న కరుణామూర్తి సమర్థసద్గురువు శ్రీసాయినాథుడు. మహారాష్ట్రదేశమునందు అహమ్మదు నగర జిల్లాయందుగల షిరిడీ గ్రామమున తన స్థిరనివాస మేర్పర్చుకొని తన అనుగ్రహదృష్టితో యావత్ ప్రపంచమునకు ప్రసరింపుచున్న సచ్చిదానంద మూర్తి శ్రీసాయిసద్గురువు.

సాయి మనలను అనేకరీతులలో ఆనాడు, ఈనాడు కాపాడుచున్నారు. సాయిబాబాను ఎవరు నిజాయితీగా సహాయం అడిగితే (ఇహమైనా, పరమైనా) అది వారికి తప్పక లభించితీరుతుంది. భక్తుడు ఎంత ఆర్తితో అర్థిస్తాడో, సాయి కూడా అదే విధంగా స్పందిస్తాడు. ఒకసారి బాబాకు భక్తుడైతే చాలు, జన్మజన్మాంతరాల వరకు అంటే భక్తునకు ఆత్మసాక్షాత్కారము కలిగే వరకు సాయి తన భక్తుణ్ణి కాపాడుతూనే ఉంటారు. □



# శ్రీశ్రీశ్రీ గణేశనాథ్ మహారాజ్ సాయిబాబా గూర్చి చేసిన ప్రసంగం



నదీ తీరంలో నుంచిని చేపను నీటిలో నువ్వేలా నిద్రపోతావని అడిగితే నువ్వు చేప రూపంలో నీళ్ళలోకి వస్తే తెలుస్తుంది అని చెబుతుంది. అదే విధముగా మీరు స్వయం భక్తుడైపోతే మీకే తెలుస్తుంది. దాసగణు బాబాను నేను ఈశావాస్యపోనిషత్తు వ్రాయ తలచానని అడిగాడు. ఈశా బాబాకు తెలియదా? వారు స్వయం ఈశ్వరులు ఎలా చెబుతారు? వేదాలు, పురాణాలు పరమాత్మ స్వరూపాన్ని గానం చేసాయి. దాసగణు సాయి సచ్చరిత్రలో గానం చేశారు. సాయి సచ్చరిత (మరాఠీలో) బాబా పదహారేళ్ల తరుణవయస్సులో మొదట శిరిడీ గ్రామంలో వేపచెట్టుక్రింద భక్తుల కొరకు ప్రత్యక్షమయ్యారు. బాబాకు ఒక రూపం, రంగు లేవు. అకార వికారాలు లేవు. అవ్యక్త తత్త్వం వ్యక్తమయ్యారు. వారిని 'సాయి' అని పిలుస్తారు. వారి, వారి మనోభావాలను గురించి ఉంటుంది.

వ్రాసినవారు ఇలా ఎందుకు వ్రాశారు? 16 సంవత్సరాల వయస్సులో ప్రకటితమయ్యారు అని. 17లో ఎందుకు కాలేదు ? 18లోనో లేక 20 ఏళ్ల వయస్సులోనో ఎందుకు ప్రకటమవ్వలేదు. బాబా జన్మించిన తేదీ తెలిసిఉంటే వారి తల్లి, తండ్రి, గురువు గురించి కూడా తెలిసిఉండాలి కదా ! ఇవన్నీ సాయిసచరిత్రలో వ్రాయలేదు. వారు 16 ఏళ్ల తరుణ వయస్సులో సాయినాథులు శిరడీ గ్రామంలో వేపచెట్టు క్రింద ప్రకటం నుండి దాని అర్థం వేరు. తరు అంటే ఈ జీవుని ప్రపంచంలో 84 లక్షల జన్మలున్నాయి. 16 ఏళ్ళంటే అర్థం పూర్తిగా షోడశకళలతో పరమాత్మ భక్తుల మనసులోని కోరికలను తీర్చడానికి.

'తరు' అంటే జీవుడు. బాబా జీవసముదాయంలో షోడశకళలతో శిరిడీ గ్రామంలో ప్రకటమయ్యారు. అందుకే దాసగణు ఈశావ్యాసోపనిషత్తుల గురించి వారిని అడిగాడు. దాసుగణు మనస్సులో నేను వేదాలలోని తత్త్వాన్ని తెలుసుకున్నాను, వ్రాయగలనని తలచాడు.

జ్ఞానవైరాగ్యాలుండటం గొప్ప విషయం కాదు. భక్తి ఉండటం గొప్ప విషయం. ఉద్ధవునికి వేదాలజ్ఞానం ఉన్నది. భగవంతునికి ఏ రూపం లేదు. నిర్గుణ నిరాకారుడు. శ్రీ కృష్ణపరమాత్మ ఉద్ధవుని మనస్సులో భక్తిని జాగృతపరచడానికి అతనిని గోపికల వద్దకు పంపారు. ఉద్ధవునితో "ఉద్ధవా! బృందావనానికి వెళ్లు. అక్కడ మా తల్లి యశోద, తండ్రి నందుడు, గోపికలు నా గుణగానం చేస్తూనో, నా చింతలోనో ఉండిఉంటారు. నేను ద్వారకాధీశుణ్ణ య్యాను. వారిని మర్చిపోయాను. వారిని రోదించవద్దని చెప్పు. వారిని ఓదార్చు. పరమాత్మకు ఓ రూపం లేదు" అని చెప్పు. ఉద్ధవుడు గోపికల వద్దకు వెళ్లి చూడగా, అక్కడ వారు ఒకరు కృష్ణునిలా, ఒకరు రాధగా ఆడుతూ, పాడుతూ ఉన్నారు. ఉద్ధవుడు వారితో నేను మీ కోసం కృష్ణుని వద్దనుండి కబురు తెచ్చా. ఉత్తరం తెచ్చాను అన్నాడు. గోపికలు నవ్వుతూ, కృష్ణుడు మావద్దనే ఉన్నాడు. దూరంగా ఎక్కడికో వెళ్లిపోలేదుగా మరి మాకు ఉత్తరం వ్రాసే అవసరమేమొచ్చింది అని అన్నారు. మరాఠీలో జ్ఞానేశ్వర్ భక్తిని గురించి ఇలా అన్నారు దాని అర్థం. మీకు కనిపించేవి ఏవైనా ఏనుగు నుండి చీమ వరకు సూర్యచంద్రుల నుండి తారల వరకు, చరచరాలలో కనుపించేవి ఏవైనా అందరిలోనూ సాయి నిండి ఉన్నారు అన్న దృష్టితో చూడగలిగితే మీ మనస్సులలో భక్తి జాగృతమౌతుంది. ప్రపంచంలో పరమాత్మ లేని చోటంటూ లేదు. అంతటా పరమాత్మ నిండిఉన్నారు. గోపికలు విషయంలో అదే భావం అంతటా



శ్రీవాసుదేవుడే అని మనం అలాగే శ్రీసచ్చిదానంద సాయిభగవానుడు అంతటా నిండి వున్నది చూడాలి. బాబా హిందువులు, ముసల్మానులు ఎవరైనా సరే వారిని పరమాత్మవలెనే చూడాలని అందరి ప్రభువు ఒక్కరే అని తెలిపారు. వారిని పరమాత్మ అని అనుకోవాలి. అనటం కాదు. వారు పరమాత్మయే. ఉద్ధవుని అహంకారం తొలగిపోగానే అతడు భక్తితో పరమాత్మ చింతన చేశాడు. అదే విధంగా దాసుగణు వేదాలను చర్చించాలని తలచాడు. అతనికి బాబా పట్ల శ్రద్ధ. బాబా అతని మనస్సులో భక్తి జాగృతం చేస్తేనే అతడు ఈశావాస్య ఉపనిషత్తు వ్రాసేదని తలచారు వేదాలలో భక్తి జ్ఞాన వైరాగ్యాలు మూడు ఉన్నాయి. జ్ఞానవైరాగ్యాలుండి భక్తిలేకపోతే ఏదీ సంభవమూ కాదు. నీ వద్ద ధనం, సంపద బాగా మెండుగా నిండుగా ఉంది. అయితే తల్లితండ్రుల పట్ల మీకు శ్రద్ధాభక్తులు లేకపోతే వారు దుఃఖపడతారు. మనం బాబా యందు భక్తి కలిగి ఉండటమే అత్యుత్తమం అని అన్నారు.

జ్ఞానేశ్వర మహారాజు "పాలు పవిత్రమైనవి, అవి మధురంగా కూడా ఉంటాయి" అని అన్నారు. ఆవు పొదుగు నిండా పాలుంటాయి. పొదుగు చుట్టూ జాతీగలు (చిన్న చిన్న పురుగులు) ఉంటాయి అని అన్నారు. అవి పాలను త్రాగుతాయా? ఎప్పుడూ రక్తాన్ని పీలుస్తాయి. మనం బాబా వద్ద ఉంటూ వారి పూజా పారాయణలు చేస్తాం. కాని మనలో బాబాయందు భక్తిలేకపోతే మానవజన్మ ఎత్తినా, అది పశు జన్మతో సమానం. అడవిలో చిన్న ప్రాణులు ఒకదాని వెనుకకు పోతాయి. గొఱ్ఱెలు, మేకలు అనేక ప్రాణులు ఒకదాని వెంట మరొకటి పోతాయి. మానవుడు మాత్రమే తనను తాను మర్చిపోతాడు. తమలో తాము పోట్లాడుకుంటారు. ఈ కారణంగానే బాబా

ప్రకటమయ్యారు. బాబా అందరి ప్రభువు ఒక్కరే కదా మరి మీరు ఎందుకు పోట్లాడుకుంటారు? చరచరాలను సృష్టించే పరమాత్మ ఒక్కరే మీరంతా కలిసి ఆ పరమాత్మ పట్ల భక్తిగా ఉంటే మీరు ఉద్ధరించబడతారు అని అన్నారు. మన కర్తవ్యం ఏమిటి?

పరమాత్మ అయిన సచ్చిదానంద సద్గురు సాయినాథుని యందు భక్తి కలిగి ఉండటం వారిని స్మరించటం ఈ సృష్టిని ఎవరు చేశారు? ఎందుకు చేసేరు? ఎప్పుడు దీని వినాశనం మనం తెలుసుకొనే అవసరం లేదు. మన తల్లి తండ్రుల వివాహం ఎప్పుడైంది. వారికి పుత్రుడు ఎప్పుడు కలిగాడు? వారు ఎప్పుడు పోతారు అని తెలుసుకొనే అవసరం లేదు. అయితే వీరు నాకు జన్మ ఇచ్చిన నా తల్లి తండ్రులు అని తప్పక తెలుసుకోవాలి. అందుచేత తల్లితండ్రుల యందు కూడా భక్తి శ్రద్ధలుండాలి. మీకు తల్లితండ్రుల ఆశీస్సులు లభించకపోతే వారియందు ఆశీర్వాదాలు అవసరం. తల్లితండ్రి ఆశీర్వాదం, గురుకృప, ఉద్యమం, ప్రారబ్దం, ఈశ్వరప్రాప్తి తల్లితండ్రుల యందు భక్తి కలిగి ఉండి, సత్పురుషుల సాంగత్యంలో ఉండి మంచి మార్గంలో నడిచి ఉంటే వారి సంతానం కూడా తల్లితండ్రుల ఆశీర్వాదంతో మంచి మార్గములో పడతారు. వారికి గొప్ప సాధుసజ్జనులు లభించి గురువు యొక్క ఆశీర్వాదము కూడా లభిస్తుంది. గురువు ఆశీర్వాదంతో ప్రపంచంలోని వ్యవహారాలు చక్కగా నిర్వహించబడతాయి. వారి ప్రారబ్దంలో వారి ప్రగతిలో ఏ కష్టాలు ఎదురైనా అవి తొలగిపోతాయి. వేయి సంవత్సరాల తరువాతైనా మీకు ఏదో వ్యాధి బాధ కలిగితే అది బాబాను భక్తితో నామస్మరణతో వెంటనే తొలగిపోతుంది. ఈశ్వరుని కృపతో దీనిని ప్రారబ్ధమని అంటారు. ప్రారబ్ధము ముగిసిపోగానే, పరమాత్మ దర్శనం కలుగుతుంది. (సశేషం)



# శ్రీసాయినాథుని వచనాలు

1. షిర్డీలో అడుగుపెట్టు, నీ అపాయాలను తరిమికొట్టు.
2. నా సమాధి మెట్లెక్కు, నీ సర్వదుఃఖాలు గట్టెక్కు.
3. నాకు శరీరము లేదు, అయినా పిలిచి చూడు పరుగున వస్తాను.
4. నీ కావలసిందా న్నడుగు, కాదనదు నా సమాధి. విశ్వసించు నా మది.
5. నేను నిత్యం జీవించే ఉంటా. ముమ్మాటికిది సత్యమే అని అంటా.
6. నా శరణుజొచ్చి నిష్ఫలంగా మరలిందెవరో చూపించు.
7. నన్నే విధంగా భజిస్తే, ఆ విధంగానే లభిస్తా.
8. నేను మీ యోగక్షేమాలను వహిస్తా.
9. అందరికి నా సహాయముంటుంది. నా వద్ద ఏది కోరినా లభిస్తుంది.
10. నా శరణుజొచ్చిన వారికి నేను ఋణగ్రస్థుణ్ణి.

# ఆణిముత్యములు

కే.ఆర్.విజయకుమార్, మదనపల్లె-517325, సాయి ప్రచారప్రతినిధి

1.సంపద ఉన్నప్పుడు త్యాగము చేయుట, శక్తి వున్నప్పుడు సహనముతో ఉండుట, కడు దుఃఖములున్నప్పటికీ ఇంకొకరిని అడుగకుండుట, మంచి ఆచార వ్యవహారములున్నప్పటికి అహంకారము లేకుండుట సజ్జనుల లక్షణములు.

2. లోకంలో ఎవరి సహాయము లేకుండా మనుష్యుడు కార్యసిద్ధిని పొందజాలడు. పొట్టు యొక్క సహాయము లేకుండా కేవలము బియ్యము మొలవదు. కనుక ప్రతి ఒక్కరికి ఏదో ఒక్కరి సహాయం తప్పక కావలసిందే !

3. ప్రతి ఒక్కడి ఆయుస్సు కరిగిపోతున్నను ఎవరికి అది తెలియదు. పచ్చిగా ఉన్న కడవలోని నీరు ఏవిధంగా మనకు తెలియకుండా ఇంకిపోతుందో అట్లే ఆయుస్సు కూడ !

4.ఎవరైతే అధర్మములో వ్యవహరిస్తారో,ఎవరు అసత్యంతో ధనమును ఆర్జిస్తారో, ఇతరులను ఎల్లప్పుడు పీడుస్తుంటాడో అతని జీవితం సుఖమనేది ఉండదు.

5. లోకంలో పర్వతము, దానికన్న సముద్రము, సముద్రము కన్న ఆకాశము, దీని కన్న పరబ్రహ్మము పెద్దది. ఈ పరబ్రహ్మ కన్న ఆశ ఇంకా పెద్దది.

# ప్రార్థన మా అభ్యర్థన

విప్రశ్రీ

ఓ సాయినాథా!
నీ ఋణం ఎలా తీర్చుకోవాలో
ఏమి ఎరుగనివారము
కనుక
మీ ఎదుట
సాష్టాంగపడుతున్నాము
నిరాశ్రయులం, నిర్భాగ్యులము
మమ్ము మనసారా ఆశీర్వదించు
అక్కున చేర్చుకొని 'అమ్మ'లా లాలించు
॥ సా ఈ ॥

ఇక నుంచి
మీ పవిత్రపాదపద్మములే మాకు
రక్ష రక్ష
పవిత్రపావనులైన మీరే శరణు శరణు
॥ సా ఈ ॥

నిద్రజాగ్రదవస్థలలో
అలవికాని ఆలోచనలు
వెంటాడి భయపెడుతున్నాయి
నిత్యం బాధిస్తున్నాయి
॥ సా ఈ ॥

మా మనసులోని తీవ్ర ఆందోళనలను
మాలోని నిరాశానిస్పృహాదులను
నీనామ సంకీర్తనవైపు మరలించు
నీ సన్నిధిన మాకు చోటు కల్పించు
॥ సా ఈ ॥


సుఖదుఃఖాలలో, మానీడవై వీడక
మాతాపితాగురుదైవమై
కాచుము కృపానిధి
భక్తజనపెన్నిధి
॥ సా ఈ ॥

మీరు;
మా మానసంలో చరించె
చలించె మానససరోవరం
తల్లి పిల్ల తాబేలులా
మీ చూపులే మా ఆహారం
॥ సా ఈ ॥

మీ సన్నిధి
ప్రేమ అనురాగ మమకారాల వారధి
పరిమితిలేని ప్రశాంత కరుణాంబుధి
మమ్ములను
మీలో ఐక్యమగునట్లు
అనుగ్రహించు పరిగ్రహించు
గుండెలోతులనుంచి పెల్లుబుకుతున్న
మా చిరకాలం వాంఛ
మీలో మమైకమే
సర్వశాంతి సౌఖ్యమే
॥సా ఈ ॥

సాయి మా దయామాయి
రామ మా కరుణమయి





# సాయినాథ ఉవాచ

సేకరణ - వ్యాఖ్యాత సాయిదాసానుదాసు
**సురేంద్రబాబు,** కోవూరు, నెల్లూరుజిల్లా

***(శ్రీసాయివాక్కులు బ్రహ్మవాక్కులు! శ్రీసాయి షిరిడీలో సశరీరులుగా మెలిగిన 60 సం॥రాలలో వారి వాచ అసంఖ్యాకమైన వాక్కులు వెలువడ్డాయి. వాటిలో ఆణిముత్యాల్లాంటి కొన్నింటిని ఏర్చి, సందర్భోచిత వ్యాఖ్యాన సహితంగా దిగువ ఇవ్వడం జరిగింది, అవధరించండి) (గత సంచిక తరువాయి భాగము)***

***(230) "లెండి అంచునున్న కలబంద ఆకులుచీల్చి,వేడిచేసి,నొప్పి ఉన్న భాగం పై కడితే తగ్గిపోతుంది."***

సదాశివ తార్కడు తన కుటుంబంతో,బాబా దర్శనార్థమై శిరిడీ వచ్చాడు, తమతో వచ్చిన సేవకు డొకడు, తీవ్రమైన నడుమునొప్పితో బాధపడసాగాడు. అతనికి చికిత్స చేయించడానికి శిరిడీలో వైద్యులులేరు,దిక్కుతోచక తర్కడు మశీదు వెళ్లి బాబా ముందు నిలబడ్డాడు, సర్వజ్ఞుడైన బాబాకు అతనెందుకు వచ్చింది తెలిసిపోయింది. అతనిని చూస్తూనే తమకాలు, నడుము విపరీతంగా బాధపెడుతూందని చెప్పారు. భక్తులు వారి బాధా నివారణకు తామేంచేయాలో సెలవివ్వమని అడిగారు. అప్పుడు బాబాపై విధంగా చెప్పారు. బాబా చెప్పిన చికిత్స వారికి కాదని, అది తమ సేవకునికి చెయ్యవలసిన చికిత్సని సదాశివ తార్కాడు గ్రహించాడు. బాబాకు నమస్కరించి వెళ్లిపోయాడు. తర్వాత కలబంద

ఆకులు తెచ్చి, బాబా చెప్పినట్లుగా చేసి, సేవకుని నడుముకు కట్టాడు, మరుసటి రోజు ఉదయానికి, అతనికినొప్పి తగ్గిపోయి ఆరోగ్యవంతుడయ్యాడు.

## ప్రబోధాత్మకమైన బాబా పలుకులు

***(231)*** ***"మీరెప్పుడూ సత్యాన్నే పలకండి.సత్యమే దైవం,అసత్యభాషణం దేవుని ఎంతగానో బాధిస్తుంది!"***

బాబా బహిరంగంగా ప్రదర్శించిన మొట్టమొదట లీల నీటిని నూనెగా మార్చి, దీపాలు వెలిగించడం ! సాయిబాబా ప్రతిదినం నూనెను వర్తకుల నడిగి మశీదులో దీపాలు వెలిగించేవారు, ఒక రోజు నూనె వ్యాపారస్థులు బాబాకు నూనెను ఉచితంగా యివ్వడం యిష్టపడక అందరూ కూడబలుక్కుని "లేదు, లేదు" అని చెప్పారు. బాబా మౌనంగా వెళ్లిపోయారు. నూనెలేకుండ ఈ పిచ్చి ఫకీరు ఏం చేస్తాడో చూద్దామనేకుతూహలంతో నూనె వ్యాపారస్థులు, గ్రామస్థులు వారిని వెంబడించారు.బాబా నీటితో దీపాలువెలిగించడం చూచి, అవాక్కయ్యారు.బాబా ఒక సిద్ధపురుషుడని వారి కర్థమైంది. తమ తెలివి తక్కువ తనానికి సిగ్గుపడ్డారు. వారు తమని శపిస్తారేమోనని భయపడి, అందరూ వెళ్లి, వారి పాదాలు పైబడి క్షమాపణ వేడుకున్నారు. బాబా వారిని క్షమిస్తూ పై మాటలన్నారు. అంతేగాకుండ, నూనెను ఉంచుకొని లేదని చెప్పడం మంచిది కాదని, ఇవ్వడం యిష్టం లేదని మాత్రమే చెప్పాలని హితవుచెప్పారు. తమను కేవలం పరిహాసించడం కోసమే మశీదుకు వెంబడించడం కూడ తప్పని చెప్పారు.

***(232)*** ***"ఈ మశీదులో కూచుని నేను అసత్యంపలుకను. సత్యంతప్ప మరేదే పలుకను !"***



బాబా వివిధ సందర్భాలలో భక్తులు తమ మాటలు విశ్వసించడంలేదని సంశయించినప్పుడు పై మాటలు పలికే వారు.అంతేగాక పవిత్రమైన మశీదులో కానీ, దేవాలయంలో కానీ, కూచుని అసత్యం పలుకకూడదని హెచ్చరించేవారు. "అసత్యభాషణం చేసే స్థలమాఇది?" అని కూడ భక్తులను ప్రశ్నించేవారు.

***(233)*** ***"ఎవరైనా నిన్ను తిట్టినా, కొట్టినా అతనితో గొడవపెట్టుకోవద్దు. ఓర్చుకోలేకుంటే ఒకటి,రెండు మాటలుమాట్లాడు. లేకుంటే ఆస్థలమే విడచి వెళ్లిపో!"***

పురందరే ఊరికే, కోపపడే స్వభావం కలవాడు, అప్పుడప్పుడు ఇతరులలో తగవులాడి గొడవపెట్టుకొనేవాడు.అటువంటి సన్నివేశాలు బాబా దృష్టిలో పడినప్పుడు వారు పురందరేకు పెట్టుకోవద్దని, సహనంతో ఉండమని, ఓర్చుకోలేని సమయాలలో ఆ స్థలం వదలి వెళ్లమని చెప్పేవారు. ప్రతీకారం తీర్చుకోవాలని, ప్రయత్నించవద్దని చెప్పేవారు. అలా గొడవపెట్టుకుంటే తమను అతిగా బాధిస్తుందని కూడ చెప్పేవారు.

***(234)*** ***"ఎవరైనా పదిమాటలు మాట్లాడితే, నీవు ఒక్కమాటలో జవాబు చెప్పు, లేకుంటే మౌనంగా ఉండు. ఎవరితో గొడవపెట్టుకోవద్దు."***

శ్రీమతిప్రధాన్ కూడా త్వరితగతిన కోపపడే స్వభావం కలది. ఆమెకు కూడ బాబా పై విధంగా సలహా యిచ్చేవారు. ఒకసారి ఆమెతో "ఒకరు మరొకరిపై కోపం ప్రదర్శిస్తే నన్నుబాధిస్తుంది. ఎవరైనా మరొకర్నినిందిస్తే, నా హృదయంలో ముల్లు గుచ్చుకున్నట్లుంటుంది. ఎవరైనా నిందను, ధైర్యంగా

సహిస్తే నాకు ఆహ్లాదంగా ఉంటుంది". అని చెప్పారు.

### ***(235) "నేను చెవికొరికే గురువును కాను !"***

### ***(236) "మా సాంప్రదాయమే వేరు !"***

గురువులు తమ శిష్యులకు ఉపదేశమిచ్చేటప్పుడు వారి నోటిని శిష్యుని చెవికి అతి సమీపంగా తీసుకెళ్లి, మంత్రాన్ని రహస్యంగా ఉపదేశించడం ఆనవాయితీ ! ఇది చూచేవారికి, గురువు శిష్యుని చెవి కొరికినట్లుంటుంది. అందువల్ల చెవి కొరకడమంటే ఉపదేశమివ్వడమో లేక ఏదైనా రహస్య సమాచారం అందజేయడమో అనే అర్థంతో వాడటం రివాజు అయ్యింది. గురువులు తమ శిష్యుని చెవిలో మంత్రాన్ని రహస్యంగా, గుసగుసగా చెప్పడం వలన, మంత్రాన్ని చెవిలో ఊదడమనే ప్రయోగం కూడ ఉంది.

బాబా పై మాటలు భక్తులతో చెబుతున్నప్పుడు, ప్రొఫెసర్ నార్కే అను భక్తుడు విని మనకు తెలియజేశాడు. అంతేగాక, శ్రీమతి రాధాబాయి దేశ్‌ముఖ్ బాబా నుండి ఉపదేశానాసిస్తూ, ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించింది. బాబా ఆమెను పిలిపించి, తాము చెవిలో మంత్రాన్ని ఉపదేశించే రకపు గురువుకాదని, తమ సాంప్రదాయమే వేరని చెప్పి, అమెను శాంతింపచేశారు. **"నా గురువు నాకేమీ మంత్రాన్ని ఉపదేశించలేదు. అలాంటప్పుడు నేను నీచెవిలో ఏ మంత్రాన్ని ఊదగలను?"** అన్నారు.

### ***(237) "నీ యబ్బనే మార్చుకున్నావురా, వెధవా ! సిగ్గులేదూ, వెళ్లిపోయిక్కడ నుండి?"***

బడే బాబా ఒక హిందువును, ముస్లింగా మార్చి, బాబా దగ్గరకు



తీసుకెళ్లాడు. బాబా తను చేసిన పనిని మెచ్చుకొంటారని బడే బాబా ఆశించాడు. కానీ బాబా, ఆ పిల్లవాని చెంప ఛెళ్లుమని పించి, పై మాటలతో గెంటివేశాడు. దీనిని బట్టి బాబా మతమార్పిడులు నిరసించేవారని, ఎవరు జన్మించిన మతాలలోనే ఉంటూ, వారి మతసాంప్రదాయాలను అనుసరిస్తూ, ఆత్మసాక్షాత్కారానికి, సాధన చెయ్యాలని వారు బోధించేవారు.

### ***(238) "వీడునా ఇంటివాసాలను లెక్కబెట్టడానికొచ్చాడు!"***

ఒకసారి ఒక ప్రముఖ జ్యోతిష్యుడు బాబాను, అంగసాముద్రిక దృష్ట్యా పరిశీలించాలని శిరిడీ వచ్చి, మశీదులో కూచున్నాడు. బాబాకు అతనెవరో, అతనెందుకు వచ్చాడో తెలిసిపోయింది. తమ ప్రక్కనున్న భక్తునికి అతనిని చూపుతూ, వాడు నా ఇంటివాసాలు లెక్కపెట్టడాని కొచ్చాడు, వాడు నా దగ్గర చూచేదేమీలేదు. వాడిని బయటకుగెంటేయండి అని ఆదేశించారు. బాబా జాతక చక్రాల్ని, సాముద్రికాన్ని నమ్మవద్దని, భక్తులకు చెప్పేవారు.

### ***(239) అతను చనిపోలేదు. అతనితో ఉండిన అతని భార్యచనిపోయింది !***

జీవన సంధ్యలోనున్న గుడ్డివాడొకడు, బాబాను దర్శించి, తనకు దృష్టి ప్రసాదించమని వేడుకున్నాడు. కానీ బాబా మౌనంగా ఉండిపోయారు. అతను నిరాశచెంది వెళ్లిపోయాడు. ఇది గమనించి, కొందరు భక్తులు ఆ గుడ్డివానిని సమీపించి, అతనా వయస్సులో దృష్టికోసం ప్రాకులాడటం, లేని కోరికల నాహ్వానించి, అదోగతిపాలవడమేనని, అతను కోరవలసినది ఆధ్యాత్మిక దృష్టి అని హితవు చెప్పారు, గుడ్డివాడు కూడా వారు చెప్పిన దానిలోని మంచిని

గ్రహించి, పశ్చాత్తాపం చెంది, తిరిగి బాబాను దర్శించి, బాబా! నాకు దృష్టి అవసరంలేదు. అంతర్గత దృష్టని ప్రసాదించండి అని వేడుకున్నాడు. బాబా అతని నాశీర్వదించి, శిరిడీలోనే ఉండమని ఆదేశించారు. అతడు నెల రోజులు శిరిడీలోనే ఉండి కొంత ఆధ్యాత్మిక ప్రగతిని సాధించి, తర్వాత చనిపోయాడు. భక్తులు బాబాతో, గుడ్డివాడు చనిపోయాడని చెప్పారు. అప్పుడు బాబా చనిపోయింది అతను కాదని, అతని నంటిపెట్టుకొని ఉండిన అజ్ఞానమనే భార్య చనిపోయిందని చెప్పారు. అతడు సద్గతి పొందాడని కూడ చెప్పారు.

***(240) " ఎందుకు నాచింకి గుడ్డ పీలికలను దొంగిలించావు? ఇంతవయస్సొచ్చి, వెంట్రుకలు నెరిసినా, నీ దొంగబుద్ధి పోనిచ్చుకోలేదు. నిన్ను గొడ్డలితో కొట్టిచంపుతాను."***

బి.వి.దేవ్ తన ప్రారబ్ధక్షుద్ర శక్తుల మూలంగా జ్ఞానేశ్వరి పారాయణం చేయలేకపోయాడు. ఎంత ప్రయత్నించినా, మనస్సు చలించి, పారాయణం విఫలమయ్యేది. బాబా అనుగ్రహం లేనిదే ఇది సాధ్యమయ్యేది కాదని గ్రహించి, బాబాను దర్శించాడు. ఇతర భక్తులు బాబా అనుగ్రహం ఎలా పొందారో,వారి అనుభావాలను సేకరించదలచాడు. ఎంతో ఆధ్యాత్మిక ప్రగతి సాధించిన, బాలారాం మాన్కర్ నుండి విషయాలను సేకరించాలని, ప్రయత్నిస్తున్నప్పుడు, బాబా అతనిని పిలిచి, పైవిధంగా నిందించి ఆగ్రహించారు. దేవ్ భయపడిపోయాడు. తనే దొంగతనం చేయలేదని వాపోయాడు. కాని బాబా అతను దొంగతనం చేసినట్లుగా ధృవీకరించారు.

తర్వాత బాబాదేవ్‌ను ప్రత్యేకంగా పిలిచి, "బావూ, నా మాటలు



నిన్ను బాధించాయా? దొంగతనం జరిగితే చెప్పాలి కదా! నేను నీకు జరీకండువా బహూకరించాలని అనుకున్నాను.నీవేమో చింకి గుడ్డపీలికలు దొంగిలిస్తున్నావ్!" అన్నారు. భక్తుల నుండి అనుభావాలు సంగ్రహించడం- చింకి గుడ్డ పీలికలు దొంగలించడమని, స్వయంగా అనుభవించి, తెలుసుకోవడం, జరీకండువా పొందడమని, దేవ్ గ్రహించాడు. బాబా అతనిని 12 రూ॥ల దక్షిణ అడిగారు. అతని దగ్గర లేనందువల్ల, ఇతరులనుండి, సేకరించి, సమర్పించాడు. బాబా అతనిని జ్ఞానేశ్వరి చదవమని ఆదేశించారు. అప్పటి నుండి ఏ ఆటంకాలు లేకుండ జ్ఞానేశ్వరి పారాయణ చేయగలిగాడు.

***(241) "శ్రేయస్సును చేకూర్చే అసత్యం సత్యమని, శ్రేయస్సును పాడుచేసే సత్యం అసత్యమని ఆర్ష ధర్మం చెబుతుంది!"***

ఒకడు సాయిబాబా దగ్గరకు వచ్చి తనకు అవసరంగా డబ్బుకావాలని అడిగాడు. బాబా తమ దగ్గర డబ్బేమీ లేదని బొంకారు. అతను నిరాశచెంది వెళ్ళిపోయాడు. అక్కడే ఉన్న శ్యామాకు, బాబా తమ దగ్గర డబ్బుంచుకొని, లేదని ఎందుకు అబద్ధం చెప్పారో అర్థం కాలేదు, "దేవా! మీరు సత్యాన్ని, వైరాగ్యాన్ని అంటి పెట్టుకొని ఉండే ఫకీర్లు కదా! అందరికి నీతులు చెప్పి మీరు మాత్రం అతనికి అబద్ధం చెప్పారెందుకు?" అని నిలదీశాడు. అప్పుడు బాబా నేను డబ్బు ఇవ్వడం అతని శ్రేయస్సుకు మంచిది కాదు. చెబితే అర్థం చేసికొనే స్థితిలో అతనులేడు. అతని మేలుకోసమే అబద్ధం చెప్పాను" అని చెప్పి పై సూక్తి వివరించారు. బాబా అబద్ధ మాడిన వేళ ఇదొక్కటే"!

(సశేషం)

ఓం గణేశాయ నమః

# అష్టగణపతి క్షేత్రములు

*(గత సంచిక తరువాయి భాగము)*

## 6. శ్రీగిరిజాత్మజ - లేన్యాద్రి



పరమేశ్వరుని ఉపదేశాను సారము పార్వతీదేవి పుత్రాపేక్షతో 12 సంవత్సరములు గణేశమంత్రమును జపించెనని శ్రీమోరేశ్వర్‌కు సంబంధించిన పురాణకథలో చదివితిమి. పార్వతీదేవి ఈ విధముగా తపస్సుచేసిన స్థానమే ఈ లేన్యాద్రి పర్వతశిఖరము. ఒక భాద్రపద శుద్ధ చతుర్థినాడు, తలస్నానము చేయుటకు ముందుగా పార్వతీదేవి తనయొంటినుండి తీసిన నలుగుపిండితో విఘ్నేశ్వరుని విగ్రహము చేసి, పూజించెను. ఆ పూజకు, తపస్సునకు సంతసించి, విఘ్నేశ్వరుడు బాలుని రూపమును ధరించి అవతరించెను. తరువాత 15 సంవత్సరములు పార్వతీమాతతో అక్కడే యుండి తన బాలలీలను ప్రదర్శించెను. బాలగణపతిని చంపుటకై సింధురాసురుడు పంపిన పెక్కు మంది రాక్షసులను అతడు హతమార్చెను. క్రూరాసుర, బాలాసుర, వ్యోమాసుర, కుశలాసుర ఇంకను మొదలైన పెక్కుమంది రాక్షసులు బాలగణపతిచే చంపబడిరి. విశ్వకర్మ లేన్యాద్రిని సందర్శించి 6 సంవత్సరముల వయస్సులోనున్న గణపతిని పూజించి అతనికి పాశము, పరశువు, అంకుశము, కమలములను అర్పణచేసెను. బాలగణపతి యొక్క 7వ సంవత్సరమున గౌతమమహాముని అతనికి ఉపనయనము చేసెను. తరువాత, పరమేశ్వరుడు గణపతికి విఘ్నాధిపత్యమును



ప్రసాదించెను. అప్పటినుండి అతడు విఘ్నేశ్వరుడాయెను. గిరిజా అనగా పార్వతి, గిరి రాజకుమార్తె. ఆత్మజుడు అనగా తనయుడు. గిరితాత్మజుడు అనగా పార్వతీ తనయుడు. కనుక, ఇచ్చట వినాయకుని పేరు "గిరితాత్మజుడు" అయినది.

**గమనిక :** లేన్యాద్రి పర్వతము పూణే జిల్లాలో జున్నర్ తాలూకాలో, గోలేగామ్ అనే గ్రామమునందున్నది. ఇది పూణేకు 94 కి.మీ.దూరమున ఉన్నది.

### ఏకదంత శరణాగత స్తోత్రమ్

అగజానన పద్మార్కం గజానన మహర్నిశమ్ । అనేకదం తం భక్తానాం
ఏకదంతముపాస్మహే । ।1।
సదాత్మరూపం సకలాదిభూతం అమాయినం సోఽహమచింత్యబోధమ్ ।
అనాదిమధ్యాంత విహీనమేకం తమేకదంతం శరణం వ్రజామః ।2।
అనంతచిద్రూపమయం గణేశం అభేదభేదాదివిహీనమాద్యమ్ ।
హృది ప్రకాశస్య ధరం స్వధీస్థం తమేకదంతం శరణం వ్రజామః ।3।
సమాధిసంస్థం హృదియోగినాం వై ప్రత్యక్షరూపేణ విభాంతమేకమ్ ।
సదా నిరాలంబ సమాధిగమ్యం తమేకదంతం శరణం వ్రజామః ।4।
త్వదీయవీర్యేణ సమర్థభూతస్వమాయయా సంరచితం చ విశ్వమ్ ।
తురీయకం హ్యాత్మప్రతీతిసంజ్ఞం తమేకదంతం శరణం వ్రజామః ।5।
సర్వాంతరే సంస్థితమేకగూఢం యదాజ్ఞయా సర్వమిదం విభాతి
అనంతరూపం హృదిబోధకం వై తమేకదంతం శరణం వ్రజామః ।6।
సుయోగినో యోగబలేన సాధ్యం కుర్వంతి తం కః స్తవనేన నౌతి ।
అతః ప్రణామేన సుసిద్ధిదోఽస్తు తమేకదంతం శరణం వ్రజామః ।7।
దేవేంద్రమౌళిమందార మకరందకణారుణాః । విఘ్నాన్ హరంతు హేరంబ
చరణాంబుజరేణవః ।8।
ఏకదంతం మహాకాయం లంబోదరగజాననమ్ । విఘ్ననాశకరం దేవం
హేరంబం ప్రణమామ్యహమ్ ।9।
॥ ఇతి శ్రీ ముద్గలపురాణే ఏకదంత శరణాగతిస్తోత్రమ్ ॥

# శ్రీలలితా సహస్రనామములు(అర్థసహితము)

(గతసంచిక తరువాత భాగం) – ***యఱమిల్లిసరోజినిజోగారావు.*** హైదరాబాద్

**94.“ఓం కౌళిన్యై నమః” :** కుండలినీ యోగస్వరూపిణిని “కౌళిని” అంటారు. వారి వారి ఇష్టదైవమును, కులాచారము ననుసరించి పూజింతురు. “కుల” అనగా మూలాధారం. “అకులము” అనగా సహస్రారం. కులరూపిని శ్రీమాత “అకుల” అనగా శివుడు. కౌళినీ ఆరాధన కుండలినీ యోగసాధనయే. పరమయోగులు, భక్తులు ఈ యోగ సాధనచేసి తరింతురు. శ్రీకులయోగినికి నమస్కారం.



**95. “ఓం కులయోగిన్యై నమః” :** మహాయోగులు కుండలినీ యోగసాధన ద్వారా శ్రీచక్రారాధన జేసి తరిస్తారు. కులమనగా షడ్చక్రముల కూడలి. తన భక్తులు, యోగులు చేయు పూజలు, ఆరాధనలు చేకొని అనుగ్రహించు శ్రీకులయోగినికి శిరసానమామి.

**96. “ఓం అకుళాయై నమః” :** మన సుషుమ్నా నాడి, ఊర్ధ్వభాగమున సహస్రదళపద్మమును “అకుళమ్” అందురు. సహస్రారమున శివునిలో అంతర్లీనమైవున్న శక్తి శ్రీమాత. “అకుల” బ్రహ్మరంధ్రము క్రింద శుక్లవర్ణకమలంలోని కర్ణిక, చంద్రమండలములో శ్రీశివశక్తిరూపిణి “అకుల” షడ్చక్రకులంలో “శివశివాని”అఖండానంద బిందువై, శివసాయుజ్యమొసగు.



శ్రీశివానందలహరికి నమస్కారం.

**97. “ఓం సమయాంతస్థాయై నమః”:** వేదమార్గము ననుసరించి, అంతర్యాన బహిర్యాగమున ఆరాధించు పద్ధతి “సమయాచారము” అందురు. సమయము అనగా, శివశక్తుల సామ్యము. యోగమార్గంలో ఆరాధించు సమాచారము – శ్రీ సమయాచారిణికి ప్రీతి. షడ్చక్రాల సాధనయే సమయాచారము. శ్రీ చక్రవాసినికి శిరసానమామి.

**98. “ఓం సమయాచార తత్పరాయై నమః”:** సమయాచారము చేయవారిని, అనుగ్రహించి తన దివ్యతత్వసారము బోధించును. దీక్షగా గురూపదేశముచే సాధకుడు సమయాచారమును పాటించవలెను. శ్రీమాతకు నమస్కారం.

**99. “ఓం మూలాధారైక నిలయాయై నమః”:** సుషుమ్నకు మూలమై, మూలధారచక్రమున 4 దళముల పద్మము నందు ముఖమును కప్పి నిద్రించును. ఇచట కుండలినికి ఆధారము. అందుచేయు ధారము అన్నారు. మూలాస్థానమున నిద్రించు కుండలినీ శక్తిని జాగృతము చేయుటయే కుండలినీ యోగము. శ్రీచక్రేశ్వరికి శిరసానమామి. మూలాధారం సృష్టికి మూలం. సృష్టికార్యమునకు ఆధారమై శరీరమూలమై వుండును.

**100. “ఓం బ్రహ్మగ్రంథివిభేధిన్యై నమః”:** శ్రీమాత శ్రీకుండలినీ రూపిణిగా షట్చక్ర ఆరాధనలో (కుండలినీయోగము) మూలధారములోని, కుండలిని జాగృతము చేయునపుడు రెండేసి చక్రములపై ఒక్కొక్క గ్రంధి ఉండును. అవి బేధించి కుండలిని సహస్రారం చేరుటే యోగసిద్ధమూలాధారస్వాధిష్ఠాన చక్రముపై బ్రహ్మగ్రంధి (ముడి) వుండును. (మెలిక) బ్రహ్మసృష్టికారుడు రజోగుణప్రధాన దేహభావనయే ఈ బ్రహ్మగ్రంధి. (సశేషం) ▯

# భక్తి భావము

**దిట్టకవి శ్రీమన్నారాయణాచార్యులు**

భగవంతుడు అందజేసిన శక్తి సామార్థ్యాలను ఉపయోగించి భగవద్దర్శనము పొందుట అత్యంత సులభము. ఎవరైతే అనన్య చింతన చేస్తారో, వారికి మృత్యురూపమైన ఈ సంసారము నుండి ముక్తి లభించగలదని గీతాచార్యుని అభయము. గీతాచార్యుడు అర్జునునితో... "అర్జునా ! నీవు నీ మనస్సును, బుద్ధిని నా ఎడల ఉంచు. అటు పిమ్మట పరమపద ప్రాప్తి పొందగల"వని అభయం ఇచ్చెను. ఏ రూపంలోనైతే మనం భగవంతుని ఊహిస్తామో ఆ రూపాన్నే నిరంతరం స్మరణ చేస్తూంటే తప్పక భగవద్దర్శనం కల్గి తీరుతుంది. మన ఆలోచనలను, మనస్సును ఆ రూపంలోకి త్రిప్పుకొనగలగాలి. అప్పుడు భగవంతుడు సులభంగా, సహజంగా ప్రాప్తించగలడు.



**అనన్యచేతాః సతతం**
**యో మాం స్మరతి నిత్యశః**
**తస్యాహం సులభః పార్థ !**
**నిత్య యుక్తస్య యోగినః** – భగవద్గీత 8-14

ఎప్పుడైతే మనస్సు లగ్నం అవుతుందో అప్పుడు ప్రాపంచిక కార్యాలవైపు మనస్సు చూడదు. ఈ విధంగా మానసిక ఆచరణ చేసినట్లైతే మనకు ఆత్మ సంయమనము కలిగి శీఘ్రంగా ఉద్ధరించబడగలము.



అరిషడ్వర్గాన్ని జయించడానికి భగవంతుడు మనకు శక్తిని ప్రసాదించినాడు. అదియే భక్తి. ఈ భక్తి అనే శక్తితో మనం అరిష్వర్గాన్ని జయించగలగాలి. అన్యాయార్జితాన్ని ఇక్కడే వదలిపెట్టి వెళ్ళాలి అన్న వివేకాన్ని కలిగి ఉన్నట్లయితే అనన్య చింతన జరుగుతుంది. అనన్య చింతన అనే వివేకాన్ని కల్గి ఈ భావనను మరపురానీయకూడదు.

మన ప్రారబ్ధకర్మల ననుసరించి మనకు ఫలం దక్కుతుంది. కావున దుఃఖించడం, చింతించడం కూడా వ్యర్థమే అన్న భావన మేల్కొనాలి. మానసిక భావాలను అదుపులో ఉంచుకొని కర్మ ఫలితములను భగవంతుని ఆజ్ఞగా, భగవంతుని నుండి వచ్చిన బహుమానంగా స్వీకరించగలిగిననాడు భగవత్ భావమును మన మది నిండా పొందగలము. హృదయంలో నిర్భయ భావన జాగృతం కావలెను. దైవీ సంపదకు మొదటి లక్షణం 'అభయం'.

మన హృదయంలో ఉన్న 'పవిత్ర భావన'కు భక్తి భావం జోడించినట్లైతే మన హృదయం పదిలంగా, పవిత్రంగా భగవన్నామస్మరణ చేయగలదు. ప్రకృతి సిద్ధమైన సాత్త్విక భావనను అలవర్చుకొని నామస్మరణ చేస్తే తప్పక భగవద్దర్శనము కలిగి, పాపనాశనమై కైవల్యం పొందగలము. దీనికి మన మానసిక సంస్కారం ఎంతో సహకరిస్తుంది.

మన హృదయంలో ఉన్న ఉన్నత భావాలు – క్షమ, దయ, శాంతి, సమత్వం, సంతోషం ఇవన్నీ పవిత్రమైనవి. ఈ సాత్త్విక భవాలకు భగవన్నామం జోడించినట్లైతే ఏ శక్తి మన చేత పాపకర్మలు చేయించలేదు. ఇది అభయం. మన మీద ఈశ్వర కృప ఉన్నది; మరియు మనం ఆయన బిడ్డలం; ఈ భావన స్థిరంగా ఉన్నంతకాలం మన మీద ఏ రాక్షసప్రవృత్తీ ప్రభావం చూపలేదు. అయితే, దీనికి అనన్యచింతన తప్పని సరి.

**"అనన్యాశ్చింతయంతో మాం .. యోగక్షేమం వహామ్యహం"** – ఇది

భగవానుని అమృత అభయం. భగవత్ప్రాప్తి 'యోగం' అయితే, దానిని రక్షించుకొనుట 'క్షేమం'. మన యొక్క అంతఃకరణము శుద్ధి అయ్యేవిధముగా మన యొక్క భావసాధన ఉండి తీరాలి. ఈ సాధనయే సత్సంగం, స్వాధ్యాయం, ఆత్మోద్ధారంతో ఆలశ్యం వినాశానికి హేతువు అవగలదు. మన మానసిక భక్తిభావాన్ని చక్కదిద్దుకొనకపోతే ఈ జనన మరణ చక్రం నుండి బయట పడలేము.

మనం ధర్మాత్ములం. ధర్మాన్ని ఆచరిస్తాం అనే దృఢభావనను పదిలిపరచుకోవాలి. అసంబద్ధమైన అసత్య అభిమానాలను విడనాడి మానసిక దృఢత్వాన్ని కల్గించుకొని ముందడుగు వేయాలి.

ఈశ్వరతత్త్వాన్ని పొందడంలో, కల్గి ఉండటంలో సదా జాగరూకులమై ఉండవలెను. ఈశ్వరాజ్ఞను పాటించాలి. ఈశ్వరాజ్ఞకు వ్యతిరేకంగా ఏదీ జరుగదు. కావున మానసిక పవిత్రతను పొందుటకు భగవన్నామస్మరణ అత్యంత ఆవశ్యకము. దీని ద్వారా మంగళమయమైన విరాట్‌స్వరూపాన్ని మానసికంగా అనుభవించగలము. భగవంతుని భక్తులుగా ఏ ప్రాణిని మనం ద్వేషించం. సమత్వ భావన, మైత్రీభావన, దుఃఖమున్నచోట దయాళువుగా ఉండగలము.

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ.**
**నిర్మమో నిరహంకారః సమ దుఃఖ సుఖః క్షమీ**

సంచార గుణం గల్గిన ఇంద్రియం, మనస్సు, బుద్ధి ఈ మూడింటినీ భగవంతునితో కలిపినట్లైతే ఇహ, పర, శ్రేయస్సు కల్గి ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది. నశ్వర సుఖాలను త్యజించి పరమధామాన్ని పొందగలిగే మార్గం – నామస్మరణ.



# ధర్మం

డి.శ్రీనివాస దీక్షితులు

ధర్మాన్ని ఆచరించడం జీవితం పరిమళం లేని పూవులా, తియ్యదనం లేని పండులా, మాధుర్యం లేని గానంలా, మమత లేని మనసులా, భక్తి లేని పూజలా, స్వారస్యం లేని సాహిత్యంలా వుంటుంది. అటువంటి జీవితం గుడ్డెద్దు చేలో పడ్డట్టుగా చిందర వందరగా తయారవుతుంది. అందుకే క్రమబద్ధమైన భారతీయ జీవన విధానానికి, సామాజిక సమైక్యానికీ ధర్మమే మూలమంటారు పెద్దలు.

**పురుషార్థాలు – ధర్మం :**

ఈ ధర్మం పురుషార్థాల్లో మొదటిదీ, మిగిలిన పురుషార్థాలకి ఆధారమయింది కూడా. సంసార దుఃఖం నుంచి బయటపడటానికి, నిజమైన ఆనందాన్ని పొందటానికి ఆచరింపబడేదే పురుషార్థం. ఈ పురుషార్థాలు నాలుగు 1. ధర్మం 2. అర్థం 3. కామం 4. మోక్షం. ఈ నాలుగింటిలో మొదటి మూడింటినీ త్రివర్గాలు అంటారు. అయితే చార్వాకులు అర్థాన్నీ, కామాన్నీ మాత్రమే పురుషార్థాలుగా అంగీకరించారు.

పరా, అపరా అని విద్యలు రెండు రకాలుగా వుంటాయి. ఋగాది వేదచతుష్టయానికి 'అపర విద్యలు' అని వ్యవహారం. త్రివర్గాన్ని అపర విద్యల ద్వారా సాధించవచ్చు. కాని పరమపురుషార్థమైన మోక్షాన్ని మాత్రం ఉపనిషత్తుల్లో పేర్కొనబడిన పరా విద్య ద్వారానే సాధించాలి.

"ధర్మం జీవితంలోని వివిధ క్లిష్టదశల్లో సముచితమైన మార్గాన్ని నిర్దేశిస్తుంది. ఐకమత్యాన్ని ప్రభోధిస్తుంది. ధర్మం కేవలం ఒక మత సిద్ధాంతం,

లేకపోతే ఒక అర్చనా విధానం, కాకపోతే ఒక గంభీరమైన నైతిక సామాజిక సూత్రం మాత్రమే కాదు. ఒక క్రమపద్ధతిలో జీవితాన్ని ముందుకు నడిపించే పరిపూర్ణమైన నియమం ధర్మం!" అంటారు పెద్దలు.

ధర్మమే జగతికి ఆధారం

**ధరతి లోకానితి ధ్రియతే వా జనైరితి ధర్మః**

లోకాన్ని ధరించేది, జనం అనుసరించేది ధర్మమని ఒక నిర్వచనముంది. దీన్నే మరో రకంగా కూడా చెబుతారు.

**ధారణాత్ ధర్మ ఇత్యాహుః ధర్మోధారయతే ప్రజాః**

సమాజాన్ని సక్రమంగా నడిపించేది ధర్మం. అది ప్రజల్ని మంచి మార్గంలో నడిపిస్తూ సజ్జనుల్ని చేస్తుంది. అందుచేతనే –

**"ధర్మ విశ్వస్య జగతః ప్రతిష్ఠా"**

ధర్మమే సకలజగత్తుకీ ఆధారం అని తైత్తిరీయారణ్యకం అంటుంది.

అభ్యుదయాన్నీ, నిఃశ్రేయసాన్నీ కలిగించేదే ధర్మం అని వైశేషికులు అంటారు. "యాగాదిరేవ ధర్మః" వేదచోదితాలైన యాగాదులే ధర్మమని మీమాంసకులు భావిస్తారు. చలనాన్ని నియతం చేసేది, గుణసంబంధం లేనిది, అరూపమయింది, అజీవమయిందీ ధర్మమని జైనులు నిర్వచిస్తారు.

పరుషమైన పలుకు, ఈర్ష్య, కోపం, దురాశ అనే యీ నాలుగూ లేని నడతే ధర్మమంటాడు తమిళవేదకర్త, "తిరువళ్ళువర్". ధర్మకర్త మించింది ధరణిలో లేదని కూడా ఆయన భావించాడు.

## సనాతన ధర్మ లక్షణాలు



అయితే ఈ సనాతన ధర్మానికి లక్షణాలేమిటి? దీని మనం ఎలా గుర్తించాలి? అన్న ప్రశ్నలకి ఈ క్రింద శ్లోకం సమాధానం చెబుతుంది.

**సత్యం దమః తపః శౌచం సంతోషో**
**హ్రీః క్షమార్జవమ్,**
**జ్ఞానం శమో దయా ధ్యానం**
**ఏష ధర్మ స్సనాతనః**

సత్యాన్ని పలకటం, ఇంద్రియ నిగ్రహం, తపస్సు, శుచిగా వుండటం, సంతోషం, సిగ్గు, సహనం, మంచి స్వభావం,జ్ఞానం, కరుణ, ధ్యానం – ఈ పన్నెండూ సనాతన ధర్మానికి లక్షణాలు.

శ్రీ రామానుజాచార్యులవారు భగవంతునికున్న జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, తేజోశక్తులనే కల్యాణ గుణాలకి తోడుగా అదనంగా మరోగుణాన్ని ఆరోపించారు. అదే ధర్మభూతజ్ఞానం. జ్ఞానమే ధర్మంగా కలిగినవాడు భగవంతుడని ఆచార్యుల వారి సిద్ధాంతం. ధర్మాచరణాన్ని ధ్యేయంగా స్వీకరించే ధర్మజీవుల్ని విశిష్టాద్వైతం ప్రముఖంగా పేర్కొనింది.

జన్మంతా ధర్మం కోసం ధారపోసిన ధర్మరాజు యక్షుడు వేసిన ప్రశ్నకి సమాధానం చెబుతూ "ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం" చీకటి గుహలో చిరుదీపం లాంటిది ధర్మం అన్నాడు. ఆ దీపకాంతులు అందరికీ కనిపించవు. జిజ్ఞాసువులకి మాత్రమే గోచరిస్తాయి. అంటే ధర్మతత్త్వం చాలా గహనమైంది అని అర్థం. అందుచేతనే –

**విద్యన్తే ధర్మాదయః పురుషార్థాః యైస్తే వేదాః**

ధర్మాది పురుషార్థాల తత్త్వాన్ని వేదాలు తెలుపుతాయని బాహ్యాలకి

ప్రాతిశాఖ్యం ప్రపంచించింది.

**యశ్చ వేదః స వై ధర్మః**

(భారతం – శాంతి పర్వం)

మన మహర్షులు వేదం ద్వారానే మనకి ధర్మాన్ని ప్రబోధించారు. ధర్మం సర్వకాలాలకీ వర్తిస్తుంది. సకల జనులకీ ఆచారణ సాధ్యమైంది ధర్మం. ధర్మం దృష్టిలో అందరూ సమానులే. ధర్మానికి ఎవరూ అతీతులు కారు.

**ధర్మాన్ని గురించి గ్రంథాలు ఎంతగా వివరించినా సజ్జనుల నడవడికను బట్టే ధర్మస్వరూపాన్ని గ్రహించాలంటాడు భీష్ముడు.** అంతే కాదు ఆ పుణ్యపురుషుడు ఎంత తేలిగ్గా అందరికీ అర్థమయ్యే రీతిలో ధర్మాధర్మాల్ని నిర్వచించాడో చూడండి –

**"దేనివల్ల అందరి ప్రేమ లభిస్తుందో అది ధర్మం. దేనివల్ల అందరి ద్వేషం లభిస్తుందో అది అధర్మం."**

**"ధర్మాన్ని బోధించడమే కాదు, ధర్మాన్ని ఆచరించడం కూడా ముఖ్యం"**

**"ధర్మో రక్షతి రక్షితః"**

**శ్రీసాయిప్రబోధ ప్రచార ప్రతినిధులు**

ప్రతిపట్నం, గ్రామంలో శ్రీసాయిదర్శన్ ప్రతినిధులను నియమించదలచితిమి. సాయి సేవలో పునీతులుకాగోరువారు మాకు వ్రాయండి. నిర్ణీత ఫారం పంపెదము. మాచే ప్రచురించిన పుస్తకములు, కరపత్రములు సాయమందిరంలో సత్సంగములలో పంచవలసి వుంటుంది. వివరములకు

**SRI SAI DARSHAN**, Dammaiguda, Nagaram Post,
Hyderabad - 500 083.
Phone : 040-6564 0220, Cell : 98667 48099



# సత్సంగ మహిమ

సాహిత్యరత్న **ఎ.వి.రమణకవి,** శ్రీకాళహస్తి

ఒకప్పుడు మహర్షులైన విశ్వామిత్ర, వశిష్టులకు ఒక వివాద మేర్పడినది. విశ్వామిత్రుడు గొప్ప తపస్వి. తన తపశ్చర్యాశక్తితో త్రిశంఖ స్వర్గము కూడా నిర్మించిన మహనీయులు.

దేవతలకు రాజైన దేవేంద్రుని సమక్షంలో విశ్వామిత్రుడు లేచి తపస్సు కన్న గొప్పది ఏది లేదు కదా ! అని దేవేంద్రునికి చెప్పగా వెంటనే వశిష్ఠులవారు అందుకు ఒప్పుకొనక సత్సంగము తపస్సు కన్నా మిన్న అనెను. ఆ వివాదము వారి మధ్య తీరలేదు. ఇరువురు సృష్టికర్తయైన బ్రహ్మదేవుని వద్దకు వచ్చి ఈ విషయముపై ఆయన అభిప్రాయము అడిగిరి. అప్పుడు బ్రహ్మదేవుడు లోకేశ్వరుడైన శివుడు సరియైన అభిప్రాయము చెప్పవచ్చునని వారికి సూచించెను. వెంటనే వారిరువురు కైలాసము చేరి పరమశివుని వద్దకు వచ్చి ఈ విషయముపై వారి అభిప్రాయము అడిగిరి. అప్పుడు పరమశివుడు ఇట్టి విషయములలో మహావిష్ణువు చతురుడని కనుక విష్ణువు నాశ్రయింపమని వారికి సలహా ఇచ్చెను. వారు అటు నుండి వైకుంఠము చేరిరి. ఇరువురు శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్లి ఈ విషయము గూర్చి ఆయన అభిప్రాయము అడిగిరి. వెంటనే విష్ణువు ఇది నాకు ప్రస్తుతము క్లిష్టముగా వున్నది కనుక ఆదిశేషుడు తప్పక మీరివురికి వివాదమునకు పరిష్కారము చూపునని, అంతేగాక అతడు వేయి నాలుకలతో సదా **రామనామము** జపించునని ఈ విశ్వములో అతను మహా భక్తుడని ఈ విషయమున ఆయన అభిప్రాయమే తుది నిర్ణయమని,

అంతేగాక అతడు మహాజ్ఞాని అని విష్ణువు వారిని ఆదిశేషుని సన్నిధికి పంపెను.

ఆదిశేషుడు వారిరువురి అభిప్రాయములను చాలా శ్రద్ధతో విని తప్పక నేనీ ఈ విషయముపై స్థిరమైన అభిప్రాయము చెప్పెదను కాని భూమి నంతను మోయుచున్నందున కొద్దిగా తలనొప్పిగా యున్నది. దయచేసి ఈ భూఖండమును నా తలపై నుంచి తొలగించండి అప్పుడు ఒకమారు ఆలోచించి ఈ విషయముపై నా అభిప్రాయము తెల్పెదను అని చెప్పెను.

అంతట వారిద్దరు "ఆదిశేషా ! భారము తొలగు విధానము మాకు తెలియజేయ"మని కోరిరి. అప్పుడు ఆదిశేషుడు "మీ మీ తపశ్చర్య సత్సంగ ఫలములను నాకు ధారపోయు"దని అప్పుడు తన శిరోభారము తొలగునని పలికెను.

విశ్వామిత్రుడు "ఇంతేనా ! నా వంద సంవత్సరముల తపస్సు దారభోయుచున్నా"నని సంకల్పించి ధారపోసెను. ఆదిశేషుని శిరోభారము తగ్గలేదు. "పోనీ నా వేయి సంవత్సరముల తపోఫలము ధారబోయుచున్నా"నని ధారపోసెను. కాని ప్రయోజనము లేదు. ఇట్లుకాదని తన జీవిత సంపూర్ణ తపోఫలము ధారపోసెను. కాని ఆదిశేషుని భారము తగ్గలేదు. అప్పుడు వశిష్టుడు ఒక క్షణకాలపు నా సత్సంగ ఫలమునిదే ధారపోయుచున్నాని ధారపోసెను. ఒక్కమారుగా ఆదిశేషుని భూభారము మటుమాయమైపోయెను. అంతట విశ్వామిత్రునకు గుణపాటమై సిగ్గుతో తలవంచుకొనెను. **సత్సంగము తపస్సు కన్నా అనేక రెట్లు ఉత్తమమని పూర్తిగా గ్రహించెను. సత్సంగము సంసార సముద్రము దాటుటకు చక్కటి నావ. అందుచే సర్వశాస్త్రముల సత్సంగ మహిమ నుద్ఘోషించుచున్నవి.**



సత్సంగము వలన మోహము తొలగి జీవన్ముక్తి ప్రసాదింపబడును.

ఎల్లవేళలా ప్రతినిత్యము సాయిపై ధ్యానించు భజన పాట

ఓం నమో నమో సాయిబాబా నమో ఓం నమో సాయిబాబా 2

1. ప్రతిజీవిలోని నన్నే చూడు అని బోధించిన సాయిబాబా 2
   సకల దేవతా సాధుస్వరూపా 2 ॥ఓంనమో॥
   సమర్థసద్గురు బాబా సచ్చిదానంద సాయిబాబా 2 ॥ఓం నమో॥
2. నేనుండగ నీకు భయమేల అని దీవించిన సాయిబాబా 2
   పిలిచినంతనే పలికెడు దైవం 2
   సమర్థసద్గురు బాబా సచ్చిదానంద సాయిబాబా 2॥ఓంనమో॥
3. జనన మరణ భయ శోక విదూరం సమర్థసద్గురు సాయినామం 2
   సకల శాస్త్ర నిజ మాగమసారం 2
   సమర్థ సద్గురునామం సచ్చిదానంద సాయినామం 2॥ఓంనమో॥

***అఖిలాండ కోటి బ్రహ్మాండనాయక రాజాధిరాజ***
***యోగి రాజ పరబ్రహ్మ పరమపురుష***
***శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సమర్థసద్గురు***
***సాయినాథ్ మహారాజ్ కీ జై***

**సర్వేజనా సుఖినోభవంతు లోకాస్సమస్తా సుఖినోభవంతు**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**ఓం తత్సత్ ఓం**

# ఆధ్యాత్మికజీవనానికి సహాయకారులు

సేకరణ : **యమ్. వెంకట్రావు,** న్యాపాల్వంచ

**ఓమ్ అజ్ఞాన తిమిరాంధస్వజ్ఞానాంజన శలీకాయా**
**చక్షురన్మీవితంయేన తస్మైశ్రీ గురవే నమః**

అవిద్యయనెడి అంధకారముచే దృష్టిలోపించిన నన్ను జ్ఞాన మనెడి కాటుకపుల్లచే నేత్రములను తెరిపించి దృష్టిని ప్రసాదించిన ఆధ్యాత్మిక గురుదేవునకు నేను నమస్కారము చేస్తున్నాను.

1. పిల్లలు పుట్టలేదని కన్నీళ్లు కారుస్తారు. సంపద కలుగలేదని మరికొందరు దహించుకొనిపోతారు. భగవంతుణ్ణి దర్శించలేదని కన్నీళ్ళు కార్చేవారు ఎంతమంది? ( ఏ కొద్దిమందో కదా !) నిజంగా భగవంతుణ్ణి ఎవరు అన్వేషిస్తారో, ఆయనకై ఎవరు ఆర్తి చెందుతారో వాళ్లే ఆయన్ను దర్శిస్తారు.
2. ఎవరి ఏకాగ్రత, వ్యాకులత తీవ్రతరమైనవో, వారు భగవంతుణ్ణి శీఘ్రంగా దర్శిస్తారు.
3. ప్రాపంచిక వస్తువులకై పిచ్చివాడవు గాక, భక్తితో పిచ్చివాడగుట మేలు.
4. ఈ కలికాలంలో భగవదనుగ్రహం పొందటానికి మూడు రోజులపాటు తీవ్రమైన వ్యాకులత ఉంటే చాలు.
5. వేలసంవత్సరాలుగా గదిలో వున్న చీకటి దీపం తేగానే మటుమాయమౌతుంది. అనేక జన్మల పాపకర్మ ఒక్క దైవీక్షణంతో నశిస్తుంది.
6. దైవానుగ్రహం అనే గాలి ఎల్లప్పుడు వీస్తూనే వుంది. జీవిత సముద్రంలో పయనించే సోమరి నావికులు, ఆ అవకాశాన్ని వినియోగించుకోరు. కాని మెళుకువతో వున్నప్పుడు దృఢగాత్రులు వారి మనస్సులనే తెర చాపలను విప్పి,



అనుకూలమైన గాలిని వినియోగించుకుంటారు.

7. నువ్వు ఎంత శ్రమపడ్డా, దైవానుగ్రహం లేకుండా ఏ పనీ, సాధ్యపడదు. దైవానుగ్రహంలేనిదే, దైవ దర్శనం కాదు.
8. భగవంతుణ్ణి దర్శించాలనే ఆకాంక్ష వుంటే భగవన్నామజపంలో పూర్తి విశ్వాసముంచి, నిత్యానిత్య వివేకం కూడా చెయ్యి.
9. భక్తితో భగవన్నామాన్ని కీర్తించు. కొండంత దూది మీద పడే నిప్పురవ్వ, దాన్ని భస్మం చేసినట్లు, భగవన్నామం వల్ల పాపపర్వతం మటుమాయమౌతుంది.
10. సత్యభామ తన నగలన్నింటితోనూ, భగవంతుని తూచలేకపోయింది. కాని రుక్మిణి, కృష్ణనామంతో తులసి దళాన్ని త్రాసురెండవవైపు వేసి తూచగలిగింది.
11. కర్రతో అంచెలు కట్టకుండా భవననిర్మాణం చెయ్యడం అసాధ్యం. పనిపూర్తయిన తర్వాత దాని అవసరాన్ని ఎవరూ పట్టించుకోరు. అదే విధంగా ప్రారంభదశలో విగ్రహారాధన అవసరంగాని, తదుపరి కాదు.
12. ఆకాశంలో, రాత్రి సమయంలో మనకు అనేక నక్షత్రాలు కనిపిస్తాయి. సూర్యోదయం కాగానే అవి కనిపించవు. అలాగని పగటిపూట ఆకాశంలో నక్షత్రాలు లేవని చెప్పటం సబబా? అజ్ఞానస్థితిలో భగవంతుణ్ణి చూడలేక పోయినంత మాత్రాన భగవంతుడు లేడని చెప్పవద్దు.
13. కుబుసాని కంటే పాము ఎలా వేరైవుందో, అదేవిధంగా శరీరానికి ఆత్మ భిన్నంగా వుంది.
14. చేతికి నూనె రాసుకుని పసరపండు ఒలిస్తే, దాని పాల జిగురు చేతులకంటుకొని ఇబ్బంది కలిగించదు. పరమాత్మ జ్ఞానంతో రక్షణ కలిగించుకొని భోగభాగ్యాలు మధ్య నివసిస్తే అవి నిన్నేవిధంగా బాధించవు.
15. సూదంటురాయి, ఉత్తరదిశనే సూచిస్తుంది. అందువల్ల ప్రయాణం చేసే పడవలు దారి తప్పవు. హృదయం భగవంతుని వైపు తిరిగి ఉన్నంతవరకు

సంసారసాగరంలో కొట్టుకొనిపోడు.

16. నీటి మీద పడవ వుండవచ్చు. కాని పడవలో నీళ్ళుండరాదు. గృహస్థుడు సంసారంలో వుండవచ్చు. సంసారాసక్తి అతనిలో ఉండకూడదు.

17. మాయ అంటే ఏమిటి? అది ఆధ్యాత్మిక పురోగతికి అడ్డం వచ్చే కామమే.


18. భగవంతుని కోరేవాళ్లు, ఆధ్యాత్మిక సాధనల్లో పురోభివృద్ధి కోరేవాళ్లు, కామినీకాంచనాల పాశాలనుంచి జాగ్రత్త పడాలి. కాకపోతే వాళ్లు విముక్తి పొందలేరు.

19. భగవంతునిలో విద్యామాయ, అవిద్యామాయ రెండూ వున్నాయి. విద్యామాయ భగవదున్ముఖం చేస్తూంది. అవిద్యామాయ ప్రక్కకు తీసుకుపోతుంది. జ్ఞానం, భక్తి, వివేకం, దయ... ఇవన్నీ విద్యామాయ లక్షణాలు. వాటి సహాయంవల్లే మానవుడు, మాధవుణ్ణి చేరుకోగలరు.

20. భగవద్భక్తి లేకపోవడంవల్ల మానవుడు అంతగా బాధపడుతున్నాడు. చివరి ఘడియల్లో భగవద్భావన కలగడానికి సాయపడే విధానాలన్నీ అతడు అవలంభించాలి. భక్తి సాధననే ఆ విధానం. జీవితమంతా దీన్ని అవలంభిస్తే చివరి ఘడియల్లో తప్పక భగవంతుని తలంపు వచ్చి తీరుతుంది.

21. **దుర్లభమైన మానవ జన్మఎత్తి, ఈ జన్మలోనే భగవత్సాక్షాత్కారానికి పాటుపడని వ్యక్తి జన్మ నిరర్థకం.**

22. పచ్చికుండ పగిలిపోతే, కమ్మరివాడు ఆ మట్టిని మళ్లీ కొత్తకుండను చెయ్యటానికి వినియోగిస్తాడు. కాల్చిన కుండ పగిలిపోతే దాన్నిక ఉపయోగించడు. అదే విధంగా అజ్ఞానంలో మరణించినవాడు మళ్లీ జన్మిస్తాడు. కాని జ్ఞానాగ్నిలో బాగా కాలినవాడు సిద్ధుడుగా మరణించి, మళ్లీ జన్మించడు.



(– '**శ్రీరామకృష్ణబోధామృతం**' (గ్రంథం ఆధారంగా)



# ప్రేమే దైవం దైవమే ప్రేమ

పరమాత్మ సందర్శనానికి ఏ సాధన చేయలేని




పరిస్థితులలో ఉండి, సశీర పంజరం నుండి బయటపడాలని (ముక్తిని) కోరుకొనే వారికోసం కరుణామయుడైన ఆదిదేవుడు మరల మానవరూపంలో సద్గురువుగా అవతరించారు. ఈ అవతారంలో వీరికి పట్టు పీతాంబరాలు, కిరీటకుండలాలు, కౌస్తుభమణి, మౌక్తికాహారాలు, వైజయంతి మాలలులేవు. కాషాయవస్త్రాలు భస్మధారణాలు త్రిపుండ్రలేపనులు లేవు. సీతాపతి శ్రీరామచంద్రునివలె ఏకపత్నీవ్రతుడు కాదు. కాని శ్రీరామునివలె దర్శనమిచ్చిన పరంధాముడు. భక్త మనోభిరాముడు. సుగుణాభిరాముడు, దయాగుణశోభితుడు. శ్రీకృష్ణమూర్తికి వలే అష్టభార్యలు లేక పోతేనేం, అష్టసిద్ధులను పరిచారికలనుగా చేసుకొన్న మహాసిద్ధుడు. నవనిధులచే పరివేష్ఠితుడైన పరమాత్ముడు. హనుమంతునివలె ఆజన్మ పర్యంతం అస్ఖలిత బ్రహ్మచారి. గృహస్థుకాకపోయినా గృహస్థులకు గృహస్థుల ధర్మాన్ని బోధించిన పురుషోత్తముడు. వీరు అదిశంకరులవలె సన్యాసాన్ని స్వీకరించలేదు. అయినా వీరు నిత్యసన్యాసి. సర్వసంగపరిత్యాగి, మహాయోగి. వీరు ఏ పీఠాన్ని గాని, మఠాన్ని గాని నెలకొల్పలేదు. ఏ ప్రత్యేక మతాన్ని స్థాపించనూ లేదు. కాని సర్వమత సామరస్యాన్ని బోధించారు. వీరు ఒక ప్రవక్త కాదు. అయినా వీరి ముఖం నుండి వెలువడినదల్లా వేదవాక్కు, బ్రహ్మవాక్కు. వారు ఎక్కడెక్కడో

పర్యటించి పరతత్త్వాన్ని ప్రచారం చేయలేదు. తామున్న చోటనే తమ వైపుకు లాక్కుని వారికి శారీరకమైన ఐహిక సుఖాలను ప్రసాదించి వారి మనస్సులను పరమార్థం వైపు మరలించేవారు. అద్వైత సిద్ధాంతాలను, భక్తి, జ్ఞానవైరాగ్యాలను అతి సులువుగా అవగాహన చేసుకొనేలా బోధించి, తమ అవతార కార్యాన్ని సాధించారు. వీరు ఎప్పుడు ఎక్కడ ఏ పుణ్యదంపతులకు జన్మించారనే విషయాన్ని ఎప్పుడూ తెలియబరచలేదు. ఎవరైనా ప్రశ్నిస్తే "బ్రహ్మ మా నాన్న, మాయ మా అమ్మ" అని చెప్పేవారు. వీరు మానవ మస్తిష్కానికి అంతుపట్టని, అర్థంకాని అనేక అద్భుత చమత్కారాలను ప్రదర్శించారు. మానవాతీతమైన వీరి మహత్తరశక్తి సంపద, అమోఘమైన, అపౌరుషేయమైన దివ్యలీలలు, వర్ణనాతీతమైన వీరి విభూతి ప్రసాద మహిమ.

జగాన అలుముకున్న అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానవెలుగును విరజిమ్మటం వారి అవతారలక్ష్యం. అందుచేత భక్తి, ప్రేమ స్నేహం వంటి ఏ స్నిగ్ధత లేక బీడువారి కరుణకట్టిన కఠిన హృదయాలలో సైతం భక్తి దివ్వెలను జ్ఞానజ్యోతులను కేవలం సంకల్ప సలిలంతో వెలిగించిన ప్రేమమూర్తి సాయి సద్గురువు. **ప్రేమే దైవం, దైవమే ప్రేమ అన్నమాటకు ప్రత్యక్ష తార్కాణం.**

ఒక విత్తనాన్ని భూదేవికి అర్పిస్తేనే, మరిన్ని విత్తనాలు లభ్యమౌతాయి. ఇది సృష్టిధర్మం. ప్రపంచ వ్యవహారంలో కూడా ఇదే వర్తిస్తుంది. ఒకటి తీసుకొంటే దానికి పదిరెట్లు తిరిగి ఇస్తానని సాయిబాబా అనడమే కాదు స్వయంగా దక్షిణను అడిగి మరీ పుచ్చుకుని భక్తులను ఋణవిముక్తులను చేసేవారు.

జై సాయిరాం ! జై జై సాయిరాం !






**చిత్తూరుజిల్లా**

మదనపల్లి శ్రీసాయి మయూరీ కళ్యాణమండపం నందు మార్చి1, 2008న **ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి** అను ద్వాదశాక్షరి ఏకనామసంకీర్తన రథసారథి హైద్రాబాద్ వాస్తవ్యులు శ్రీ డి.శంకరయ్యగారి పర్యవేక్షణలో వారి శిష్యులు కదిరి వాస్తవ్యులు శ్రీ జి.సాంబమూర్తి బృందంవారిచే ద్వారకామాయి భజన సంఘం వారు అఖండనామసంకీర్తన ఏకాహం ఏర్పర్చినారు. భక్తిశ్రద్ధలతో సాయి బంధువులు విరివిగా విచ్చేసి సాయినామసంకీర్తనలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించినారు. మార్చి2, 2008న ఉదయం 10 గం॥లకు సామూహిక సత్యవ్రతములు జరిపించినారు.

పీలేరు గ్రామములో 5-2-2008 నుండి 7-2-2008 వరకు శ్రీశ్రీశ్రీ షిరిడీ సాయిబాబావారి ఆలయము పంచమవార్షికోత్సవమునకు భక్తాదులు అధికసంఖ్యలో విచ్చేసి కార్యక్రమమును విజయవంతము చేసినారు.

**గుంటూరు జిల్లా :**

నందూరు, పొన్నూరు మండలం శ్రీసాయినాథ సేవా సమాజమువారు శ్రీషిరిడీ సాయిబాబా పునఃప్రతిష్టమహోత్సవము ది.09-02-2008 శనివారం నుండి 13-02-2008 వరకు "మహాస్నపన" మరియు 11-02-2008 నుండి అభిషేకం మరియు శ్రీమహాగణపతి, పదపద్మములు, దత్తాత్రేయస్వామి, మురళీకృష్ణస్వామి దేవతా మూర్తులను ప్రతిష్ఠించినారు.

**–(అన్నంరాజు రామారావు)**

**ఓరిస్సా :**

డొంకిన్‌కనల్ జిల్లా, అంబనాలీలో గల శ్రీదత్తాత్రేయసాయి ఆశ్రమంవద్ద "ది నేషనల్ సాయి డివోటీస్ కన్వెక్షన్" ది. 19-02-2008 తేదీన భజన, నామజపం, 20-02-2008 సాయినామం మరియు సంకీర్తన, శ్రీ గణేశ్‌నాథ్‌జీ మహారాజ్‌గారిచే ప్రారంభోత్సవము, ది. 21-02-2008 తేదీ భజన, ప్రపంచశాంతి కొరకు ప్రార్థనలు, శ్రీశ్రీశ్రీగణేశ్‌నాథ్‌జీ మహారాజ్ వారి ప్రవచన, శ్రీ అనిల్ భవారా & పార్టీ (బొంబాయి) వారిచే 22-02-2008 తేదీన భజన, నామజపం. దేవవ్యాప్తంగా విచ్చేసిన డెలిగేట్‌లకు శేషవస్త్రములు, మిఠాయిలు పంచినారు. అయిదువేలమందికి అన్నసంతర్పణ చేసినారు.

**హైద్రాబాద్ :**

లక్ష్మీనగర్, సైదాబాద్ శ్రీషిర్డిసాయిబాబా మందిరములో ది. 23-02-2008న శనివారం నుండి 25-02-2008 సోమవారం వరకు బ్రహోత్సవము (6వ వార్షికోత్సవము) సంరంభములు, నిత్యకార్యక్రమములు, ప్రత్యేక కార్యక్రమములు జరుపబడినవి.

**నెల్లూరు :**

అల్లూరు, పేటసత్రంరోడ్‌లో శ్రీ షిర్డీసాయిబాబా మందిరమందు 24-02-2008 ఉదయం 7-58 ని॥లనుండి 8.01 ని॥ల వరకు శ్రీ షిరిడీసాయిబాబా మరియు పరివార దేవతల ప్రతిష్ఠాపమహోత్సవము, శ్రీనూతలపాటి సుబ్బయ్యశాస్త్రిగారి (శైవాగమ పండితులు) మరియు శ్రీ ముప్పిరాల రాఘవయ్యశర్మ (ఆగమ పండితులు)గారి పర్యవేక్షణలో జరిగినది.

**- (బి.రమణయ్య)**

Printed Published and owned by A.V.Ramana Rao at 1-5-62/2/B Maruthi Nagar, Hyderabad - 500 060. Printed at Sri Kala Printers, 1-1-781/B/4, Gandhi Nagar, Hyderabad - 80. Ph : 27611864 Editor - **A.V.Ramana Rao**